PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 342 | విజయవాడ, బుధవారం 12 జులై 2023 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 12 July 2023 | Rs

బ్రిజ్ భూషణ్ శిక్షార్హుడే

- బాధితులను లైంగికంగా వెంటబడి వేధించినట్లు ఆధారాలు
- ఛార్జిషీటులో ఢిల్లీ పోలీసులు వెల్లడి

• లోపలి పేజీలో.. •

త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్

- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-రాజాం (విజయనగరం జిల్లా)

ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి త్వరలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించిన ఫైలు ప్రస్తుతం ముఖ్యమంత్రి వద్ద ఉందని వెల్లడించారు. విజయనగరం జిల్లా రాజాంలో రూ.1.48 కోట్లతో 1.42 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న నూతన బస్ స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌తో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బొత్స విలేకరులతో మాట్లాడుతూ.. వలంటీర్ల పట్ల జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. నోటికి ఏది వస్తే అది మాట్లాడటం సరికాదన్నారు. రాజకీయాల్లో విమర్శలు విధానపరంగా, సంస్థాగతంగా ఉండాలే తప్ప, ఇటువంటి తప్పుడు వ్యాఖ్యలు తగన్నారు.

పంచాయతీల సమస్యలపై

అఖిలపక్షంతో సిఎం చర్చించాలి

- సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు
- అధికారాల్లేకుండా పరిపాలనా వికేంద్రీకరణ అంటే బూటకమే



సిపిఎం రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వి. శ్రీనివాసరావు


ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీలకు రావాల్సిన నిధులు, విధులపై రాజకీయ పార్టీలు, సర్పంచుల సంఘాల అఖిలపక్షంతో ముఖ్యమంత్రి చర్చించాలని సిపిఎం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రసంగించిన పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి తక్షణం జోక్యం చేసుకోవాలని, అఖిల పక్ష సమావేశం నిర్వహించాలని వారు కోరారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఇవ్వాలని కోరుతూ సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ఉదయం విజయవాడ బాలోత్సవ భవన్లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీలతోపాటు, వేర్వేరు జిల్లాలకు చెందిన సర్పంచులు హాజరయ్యారు. తొలుత వక్తలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు వేదిక మీదకు ఆహ్వానించారు. మరో రాష్ట్ర కమిటీ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలైన పంచాయతీ సర్పంచులు తమకు నిధులు కావాలని రోడ్డెక్కి ఆందోళనకు దిగడం ప్రభుత్వం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, సర్పంచుల సంఘాలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ తరహా పోరాటం వల్ల ఇప్పటి వరకూ జరుగుతున్న ఉద్యమం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. అలాగే సర్పంచులు కూడా పంచాయతీల్లో ఇంటింటికీ తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. సర్పంచుల ఆందోళనకు సిపిఎం పార్టీగా పూర్తి సంఘీభావం ప్రకటించారు. సిపిఎం నేతృత్వంలో పాలన చేస్తున్న కేరళ, గతంలో అధికారంలో ఉన్న త్రిపుర, బెంగాల్లో స్థానిక సంస్థలకు తొలి ప్రాధాన్యత ఇచ్చాయని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా ఎన్నికల నిర్వహణ, మహిళా రిజర్వేషన్లు, ప్రజా సభలు నిర్వహించడం ద్వారా సర్పంచులు అత్యంత బలమైన వ్యక్తులుగా మారారని వివరించారు. రాజ్యాంగంలోని 63-64 సవరణలకు సిపిఎం అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అనుసరించిన విధానాలే కారణమని వివరించారు. జగన్ మూడు రాజధానులని చెప్పి వికేంద్రీకరణ అంటున్నారని, అది మోసమని, స్థానిక సంస్థలను బలోపేతం చేయడమే నిజమైన పాలనా వికేంద్రీకరణ అని అన్నారు. తనకు నిధులు కావాలని పదేపదే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్న సిఎంకు సర్పంచుల బాధలు, ఆందోళనలు కనబడకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. అలాగే చట్ట ప్రకారం వచ్చిన నిధులను మిగతా 2లో

ఎన్నిసార్లు పొడిగిస్తారు?

- ఇడిగా సంజయ్ మిశ్రా పొడిగింపు చట్ట విరుద్ధం
- మోడీ సర్కార్‌కు తలంటిన సుప్రీంకోర్టు
- ఈ నెల 31తో వైదొలగాలని ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ప్రతిపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)ని కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందన్న విమర్శల నేపథ్యంలో సుప్రీంకోర్టులో మోడీ సర్కార్‌కు మంగళవారం గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇడి డైరెక్టర్‌గా సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగిస్తూ వచ్చిన కేంద్ర ప్రభుత్వ తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా ఆంక్షేపించింది. ఇలా ఎన్నిసార్లు పొడిగించుకుంటూపోతారని నిలదీసింది. ఆయన ఈ నెల 31న వైదొలగాల్సిందేనని నిర్దేశించింది.

ఇడి డైరెక్టర్‌గా సంజయ్ కుమార్ మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ నేతలు జయ ఠాకూర్, రణదీప్ సింగ్ సూర్జేవాలా, టిఎంసి ఎంపి మహువా మొయిత్రా, టిఎంసి అధికార ప్రతినిధి సాకేత్ గోఖలే, కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మసనం విచారించింది. సుదీర్ఘ విచారణ తరువాత మే నెలలో తీర్పును రిజర్వ్ చేసింది. ఆ తీర్పును మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ మిగతా 5లో

పరిశ్రమలకు డిశాలినేషన్ నీటి కోసం

ఇజ్రాయిల్ తరహా విధానం

ఎస్‌ఐపిబి సమావేశంలో సిఎం జగన్ ఆదేశం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇజ్రాయిల్ తరహా విధానాలతో పరిశ్రమలకు డిశాలినేషన్ నీటిని వినియోగించుకునేలా చూడాలని అధికారులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఉదయం తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్‌ఐపిబి) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరిశ్రమలకు శుద్ధిచేసిన, డిశాలినేషన్ నీటిని వినియోగించుకునేలా చూడాలని, జనాభా పెరుగుతున్న కొద్దీ తాగునీటికి, వ్యవసాయానికి నీటి కొరత రాకుండా చూడాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ మార్గాలను చూడాలన్నారు. అలాగే కంపెనీలు ఏవైనా స్థానిక పంటను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చూడాలని తెలిపారు. ముఖ్యంగా పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై కలెక్టర్లు చొరవ తీసుకుని పరిశీలన చేయాలని పేర్కొన్నారు. ఈ పద్ధతి సరిగ్గా అమలవుతుందా లేదా అన్న దానిపై సమీక్ష చేసి క్రమం తప్పకుండా ప్రతి ఆరునెలలకు ఒకసారి కలెక్టర్లు నివేదిక పంపించాలని సూచించారు. ప్రైవేటు సహా అన్ని పరిశ్రమల్లోనూ ఈ పద్ధతి అమల్లో ఉండాలన్నారు. ఈ విషయంలో పరిశ్రమలకు అన్ని రకాలుగా తోడుగా ఉంటున్నామని, భూములు ఇతర వనరులు సమకూరుస్తున్నామని తెలిపారు. స్థానికంగా ఏర్పాటయ్యే పరిశ్రమలపై ప్రజల్లో వ్యతిరేకత రాకుండా ఉండేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పరిశ్రమ సమర్థవంతంగా నడవాలన్నా స్థానికుల మద్దతు అవసరమని చెప్పారు. రాష్ట్రంలో సరిపడా నైపుణ్య వనరులు ఉన్నాయని, అటువంటి వాటిని వినియోగించుకుని మానవ వనరులను అభివృద్ధి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పరిశ్రమలకు ఆమోదం తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా వేంపల్లెలో రూ.8,104 కోట్లతో జెఎస్‌డబ్ల్యు ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న 1500 మెగావాట్ల హైడ్రో పవర్ ప్లాంటుకు ఆమోదం తెలిపారు. 2024 డిసెంబర్లో పనులు ప్రారంభించేలా చూడాలని సూచించారు. నంద్యాల జిల్లా కోటపాడు, అనంతపురం జిల్లా బోయల ఉప్పలూరు, వైఎస్ఆర్ జిల్లాల్లో క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ రూ.2,450 కోట్ల పెట్టుబడితో ప్రాజెక్టుకు అనుమతించారు. విశాఖ జిల్లా అన్నవరంలో మే ఫెయిర్ ఆధ్వర్యాన రూ.525 కోట్లతో హోటళ్ల నిర్మాణానికి ఎస్‌ఐపిబి ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లా పేరూరులో రూ.218 కోట్లతో హయత్ ఇంటర్నేషన్ హోటల్ నిర్మించనున్నారు. అచ్యుతాపురం సమీపంలోని కృష్ణపాలెం వద్ద కోకాకోలా బేవరేజస్, తిరుపతి జిల్లా వరదాయపాలెం మండలం కువ్వకోలి వద్ద సిసిఎల్ ఫుడ్, బేవరేజస్ కంపెనీ ఏర్పాటుకు అనుమతిచ్చారు. నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో గోకుల్ ఆగ్రో రిసోర్స్ లిమిటెడ్ పేరుతో ఎడిబుల్ ఆయిల్ తయారు చేసే కంపెనీని నిర్మించనున్నారు. శ్రీసిటీ వద్ద కోకో బటర్, పౌడర్, మాస్ తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నారు.

ఎఐతో 90 శాతం ఉద్యోగాలు ఫట్

- స్టార్టప్ దుకాన్‌లో సిబ్బందికి ఎసరు

• లోపలి పేజీలో.. •

పెళ్లింట తీవ్ర విషాదం

- వివాహ రిసెప్షన్‌కు వెళ్తుండగా సాగర్ కాలువలో 'ఇంద్ర' బస్సు బోల్తా
- ఏడుగురు దుర్మరణం
- 19 మందికి స్వల్పగాయాలు



సాగర్ కాలువలో పడిన ఆర్‌టిసి ఇంద్ర బస్సు

ప్రజాశక్తి- దర్శి (ప్రకాశం జిల్లా), అమరావతి బ్యూరో

పెళ్లింట తీవ్ర విషాదం చోటు చేసుకుంది. వివాహ రిసెప్షన్‌కు వెళ్తున్న బృందం ఘోర ప్రమాదానికి గురైంది. ఆర్‌టిసి ఇంద్ర బస్సు సాగర్ కాలువలో పడిపోవడంతో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. 19 మంది గాయపడ్డారు. ప్రకాశం జిల్లాలో గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుల, పోలీసుల కథనం ప్రకారం... పొదిలికి చెందిన షేక్ షిరాజ్ వ్యాపార నిమిత్తం సౌదీ అరేబియాలో కుటుంబంతో సహా నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె ఫాతిమాకు, కాకినాడకు చెందిన అక్బర్ షరీఫ్‌కు ఈ నెల తొమ్మిదిన పొదిలిలో వివాహమైంది. షరీఫ్ ఇంటి వద్ద మంగళవారం నిర్వహించే వివాహ రిసెప్షన్ వేడుకకు షిరాజ్ కుటుంబసభ్యులు, బంధువులు మొత్తం 37 మంది పొదిలి నుంచి ఆర్‌టిసి ఇంద్ర బస్సులో సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు బయలుదేరారు. ఒంటి గంట సమయంలో దర్శిలోని పొదిలి రోడ్డులోగల సాగర్ కాలువ వద్ద ఎదురుగా వస్తున్న ట్రావెల్ బస్సును తప్పించబోయి ఇంద్ర బస్సు కాలువలో పడిపోయింది. ఈ ప్రమాదంలో బస్సులోని ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వారిలో మతపెద్ద అబ్దుల్ హజీద్ (65), చెన్నయ్ పోలీస్ అసిస్టెంట్ కమిషనర్ భార్య షేక్ రమీజ్ (48), షేక్ హీనా (6), అబ్దుల్ హనీ (60), ముల్లా నూర్జహాన్ (58), ముల్లా జానీబేగం (65), షేక్ షబీనా (35) ఉన్నారు. సాగర్‌లో జలాలు లేకపోవడంతో మిగిలిన 19 మంది స్వల్పగాయాలతో బయటపడ్డారు. చిమ్మచీకటిగా ఉండడంతో ఏమి జరిగిందో తొలుత అర్థం కాలేదని మిగతా 2లో

ప్రతిపక్షాల భేటీకి మరో

ఎనిమిది పార్టీలు

- బెంగళూరు సమావేశంతో ఏకతాటిపైకి
- 17, 18 తేదీల్లో సమావేశానికి ఆహ్వాన లేఖలు పంపిన ఖర్గే

అమరావతిపై అత్యవసర విచారణకు

సుప్రీంకోర్టు నిరాకరణ

- డిసెంబర్‌కి వాయిదా.. ఆ లోపు విచారణ సాధ్యం కాదు
- స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

• లోపలి పేజీలో.. •



గుంటూరు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం

- పలు జిల్లాల్లో అరెస్టులు
- మానవహారాలు, కలెక్టరేట్ల ముట్టడి
- విజయవంతంగా ముగిసిన 36 గంటల ధర్నా

2

జీడి రైతులు, కార్మికుల గోడు పట్టదా!

గిరిపుత్ర

మీడియా వాచ్

జీడి పిక్కల ధర పాతాళానికి పడిపోయి రైతులు, విచ్చలవిడి దిగుమతులు, పప్పునకు తగిన ధర లేదంటూ పరిశ్రమలను మూసివేయడంవల్ల వాటిలో పని చేసే కార్మికులూ ప్రస్తుతం తీవ్ర కష్టాల్లో ఉన్నారు. ఈ సమయంలో జీడి సమస్యపై స్పందించి, సంబంధిత అంశాలను విశ్లేషించడం తద్వారా ప్రభుత్వాల దృష్టిని రాబట్టి బాధితులకు కొంతైనా ఊరట కలిగించేందుకు కృషి చేయడం మీడియా బాధ్యత. అయితే, ఇటీవల రెండు ప్రముఖ తెలుగు దిన పత్రికలు 'జీడి రైతు గుర్తున్నాడా?', 'జీడిపై చీడ రాతలు' అంటూ రాసిన కథనాలు పరిశీలిస్తే రైతులు, కార్మికుల ప్రస్తుత దుస్థితికి కారణాలు లేదా తక్షణ ఉపశమన చర్యల కన్నా తాము కొమ్ము కాసే రాజకీయ పార్టీలు, ఆ ప్రభుత్వాలను పొగడడానికి లేదంటే తెగనాడడంపైనే కేంద్రీకరించడం గమనార్హం. విచ్చలవిడి దిగుమతులకు, ధరల ఒడిదుడుకులకు ప్రధాన కారణమైన కేంద్ర ప్రభుత్వం, దాని విధానాలపై పల్లెత్తు మాట కూడా అనకపోవడం దారుణం. జీడి దేశవ్యాప్తంగా తీర ప్రాంతమంతటా పండించే పంట కనుక వివిధ రాష్ట్రాల్లో పరిస్థితి, ఆయా ప్రభుత్వాల తీరు కూడా వివరిస్తే బాగుండేది.

పంట తీరు తెన్నులు

దేశంలోని సముద్ర తీర రాష్ట్రాల్లో జీడి పంట సాగు చేస్తున్నారు. అయితే, సాంప్రదాయ ప్రాంతాల్లోనేగాక ఆ తరువాత గిరిజన ప్రాంతాల్లోనూ జీడి సాగు పెరిగింది. వాటిలో కొన్ని అటవీశాఖ వేసిన తోటలు కాగా ఎక్కువ భాగం గిరిజనులు, కొండ వాలు ప్రాంతాల్లో ఇతర పేదలు సాగు చేస్తున్నవే. ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణంలో, ఉత్పత్తిలో రెండవ స్థానంలో ఉంది. అదే విధంగా జీడి పప్పు ప్రోసెసింగ్ పరిశ్రమలోనూ కేరళ తరువాతి స్థానం ఆంధ్రదే. కాబట్టి అటు రైతును, ఇటు కార్మికులను ఆదుకునేందుకు, అలాగే పరిశ్రమకు చేయూతనివ్వడానికి కృషి చెయ్యడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత. కానీ ఈ విషయంలో అటు టిడిపి, ఇటు వైసిపి సర్కార్లు చేసింది స్వల్పమే అని చెప్పక తప్పదు. తిత్లీ తుపాను బాధిత రైతాంగానికి నష్టపరిహార చెల్లింపు విషయంలో గత ప్రభుత్వం ఇబ్బంది పెడితే ఆందోళనలు సాగాయి. ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం చెల్లించింది. అయితే, నష్టం జరిగినపుడు పరిహారం ఇవ్వడం మాత్రమే చాలదు.

పంటకు ప్రోత్సాహం- ప్రభుత్వాల తీరు

జీడి పంట విస్తీర్ణం, జీడిపప్పు ప్రోసెసింగ్‌లో ఒకప్పుడు దేశంలో కేరళ మొదటి స్థానంలో ఉండేది. కానీ వివిధ రాష్ట్రాల్లో సాగు పెంపుదలకు ఆయా ప్రభుత్వాలు చేసిన కృషి మూలంగా అక్కడ పెరిగినందున ఇప్పుడు విస్తీర్ణంలో కేరళ ఆరవ స్థానానికి పోయింది. ప్రోసెసింగ్‌లో మొదటి స్థానమే! గత ఆరేళ్లుగా అక్కడి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పంట విస్తీర్ణం, దిగుబడి పెంచడానికి వివిధ చర్యలు, పథకాలు చేపట్టింది. జీడి పంట అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక రాష్ట్ర స్థాయి బోర్డు పని చేస్తోంది. అలాగే పరిశ్రమలకు అవసరమైన ముడి సరుకు అంటే జీడి పిక్కలను రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో అలాగే విదేశాల నుండి కొనుగోలు చేసేందుకు ఒక కార్పొరేషన్, పరిశ్రమలను నిర్వహించడం, జీడిపప్పు మార్కెటింగ్ కోసం మరో రెండు వేర్వేరు కార్పొరేషన్లున్నాయి. ఇన్ని విధాలుగా అక్కడి ప్రభుత్వం రైతులకు, కార్మికులకు చేదోడువాదోడుగా నిలుస్తోంది. ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటకల్లో పంట అభివృద్ధికి పరిశోధనా సంస్థ లేదా ప్రభుత్వ బోర్డులున్నాయి. కానీ ఎ.పి లో మాత్రం కేవలం ఉద్యానవన శాఖ అన్ని పంటలతోపాటు జీడి గురించి 'కూడా' పని చేస్తుంది. గతంలో హుదూద్ తుపాను వచ్చినపుడు కొబ్బరి పరిశోధనాకేంద్రాన్ని శ్రీకాకుళం జిల్లాలో ఏర్పాటు చేస్తామని అప్పటి ముఖ్య మంత్రి చెప్పారు. ఆ తరువాత తిత్లీ తుపాను వచ్చిన పుడు ఆయనే జీడి కోసం బోర్డు ఏర్పాటు చేస్తామన్నారు. ఆ హామీలు నీటి మూటలయ్యాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం అయినా ఆ దిశగా ఏమీ చేయలేదు. తాజాగా రైతు దినోత్సవం సందర్భంగా మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ కమిషనర్ స్థాయి అధికారులు జిల్లాలో పర్యటించి పరిశీలించారు కానీ ఏమీ ఆచరణలోకి రాలేదని ప్రజల ముందు ఒప్పుకోవలసి వచ్చింది. ఇప్పటికైనా రాష్ట్రంలో జీడి రైతును, కార్మికులను ఆదుకునేందుకు, పరిశ్రమను నిలబెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

దక్కని ధర- ఆర్‌బికె, జిసిసిల పాత్ర

గతంలో రూ.15,000-18,000 అమ్మిన 80 కిలోల బస్తా ధర గడచిన రెండు మూడేళ్లుగా దిగజారుతూ వస్తోంది. ఇప్పుడు పాతాళానికి పోయి రూ.7,000 నుండి 8,000 మధ్యలో కొంటున్నారు. ఇటువంటి సమయంలోనే రైతుకు సర్కారు చేయూత అందించాలి. ఆర్‌బికెల ద్వారా బస్తా రూ.16,000 చొప్పున కొనుగోలు చేయాలని రైతులు ఆందోళనలు చేస్తున్నారు. కాని, 'విత్తు నుండి విక్రయం వరకూ అంతా ఆర్‌బికె ద్వారానే' అని ప్రకటించిన ప్రభుత్వం జీడి పంట విషయంలో ఆ ఊసెత్తకపోవడం దారుణం. గిరిజనుల నుండి జీడి పిక్కలను చాలా కాలం కిందట గిరిజన కార్పొరేషన్ కొనుగోలు చేసి, ప్రోసెస్ చేయించి మార్కెటింగ్ చేసింది. పరిమితంగానే చేసినా ఇప్పుడు అది కూడా లేదు. టిడిపి ప్రభుత్వం 2017 ప్రాంతంలో 'వెలుగు' ద్వారా కొనుగోలు చేసి ఓలం అనే ప్రైవేటు సంస్థతో (కేరళ ప్రభుత్వానికి చెందిన కార్పొరేషన్ కోరినా తిరస్కరించి) అమ్మకం ఒప్పందం చేసింది. అది కూడా రెండేళ్లు మించి సాగలేదు. రాష్ట్రంలో జీడి పిక్కలను ప్రభుత్వ సంస్థ ఏదీ కొనుగోలు చేయడంలేదు. అలా కొనుగోలు చేయకుండా 'మాది రైతు ప్రభుత్వం' అని గొప్పలు మిగతా2లో



రాష్ట్రం	విస్తీర్ణం (వేల హెక్టార్లు)	ఉత్పత్తి (వేల మె.టన్నులు)
ఆంధ్ర ప్రదేశ్	197.92	127.72
ఒడిషా	223.45	121.28
కర్ణాటక	138.00	74.86
మహారాష్ట్ర	191.45	189.71
తమిళనాడు	173.24	77.30
కేరళ	106.52	71.76
భారత్	1183.91	751.85

(ఆధారం: కేంద్ర ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ కాష్యు అండ్ కోకో డెవలప్‌మెంట్-2021-22 లెక్క)


అనకాపల్లి కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలను అడ్డుకుంటున్న పోలీసులు


ఏలూరు కలెక్టరేట్ వద్ద బారికేడ్లను తోసుకుని ముందుకు వెళ్తున్న అంగన్‌వాడీలు


చిత్తూరులో వేలూరు రహదారిని దిగ్బంధించిన అంగన్‌వాడీలు


విశాఖలో అంగన్‌వాడీలను అరెస్టు చేస్తున్న పోలీసులు

అంగన్‌వాడీలపై ప్రభుత్వ నిర్బంధం

- పలు జిల్లాల్లో అరెస్టులు
- మానవహారాలు, కలెక్టరేట్ల ముట్టడి
- విజయవంతంగా ముగిసిన 36 గంటల ధర్నా

ప్రజాశక్తి- యంత్రాంగం, అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలపై ప్రభుత్వం రెండో రోజు నిర్బంధం ప్రయోగించింది. పలు జిల్లాల్లో అరెస్టులకు పాల్పడింది. పోలీసులతో జరిగిన తోపులాటలో పలువురు నాయకులు, అంగన్‌వాడీలు స్పృహ తప్పిపడిపోయారు. భీమవరం, విశాఖలో పోలీసులు అమానుషంగా ప్రవర్తించారు. 36 గంటల ధర్నాలో భాగంగా కలెక్టరేట్ల వద్దే అంగన్‌వాడీలు వంట, వార్పు కొనసాగించారు. రాత్రి అక్కడే బస చేశారు. ధర్నా ముగింపు అనంతరం కలెక్టరేట్ల ముట్టడి, మానవహారం నిర్వహించారు. అధికారులు వారి వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అది ఆరంభం మాత్రమేనని, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపుతామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అంగన్‌వాడీలు హెచ్చరించారు. అరెస్టు చేసిన వారందరినీ పోలీసులు ఆ తర్వాత విడుదల చేశారు.

భీమవరంలో అంగన్‌వాడీల పట్ల పోలీసులు జులం ప్రదర్శించారు. ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి బూటు కాళ్లతో తొక్కి కర్కశంగా వ్యవహరించారు. అసభ్యకర పదజాలాలతో దూషించారు. బారికేడ్లను అంగన్‌వాడీలకు అదిమిపెట్టారు. కాళ్లతో నొక్కిపెట్టి విచక్షణారహితంగా ప్రవర్తించారు. దీంతో, పలువురు యూనియన్ నాయకులు, అంగన్‌వాడీలు స్పృహ కోల్పోయారు. వందలాది మంది అంగన్‌వాడీలకు గాయాలపాలయ్యారు. దీంతో, ఆగ్రహించిన అంగన్‌వాడీలు బారికేడ్లను తోసుకుంటూ కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లి బైఠాయించారు. సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన ఉధృతంగా సాగింది.

గుంటూరులో బారికేడ్లను తోసుకొని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన అంగన్‌వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా తోపులాట చోటుచేసుకుంది. అంగన్‌వాడీల వద్దకు డిఆర్ఒ వచ్చి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. దీనికి ముందు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కేంద్ర 7వ వేతన సంఘం సిఫార్సుల మేరకు అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెన్ఫిట్స్ కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ధర్నాకు వస్తున్న వారిపై ప్రభుత్వం బెదిరింపులు పాల్పడడం శోచనీయమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కేబినెట్ సమావేశంలో అంగన్‌వాడీల సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 36 గంటల ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు ర్యాలీగా వెళ్తున్న అంగన్‌వాడీలను జైలు రోడ్డు జంక్షన్ వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులు అమానుషంగా వ్యవహరించారు. 650 మందిని అరెస్టు చేసి పోలీస్ బ్యారెక్స్ కల్యాణ మండపానికి తరలించారు.

అనకాపల్లిలో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసులు వి.మాడుగులకు చెందిన సూర్యకళావతి, సరోజిని స్పృహతప్పి పడిపోయారు. పలువురు అంగన్‌వాడీలను, సిఐటియు నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. అంగన్‌వాడీల పోరాటానికి ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, టిడిపి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు మద్దతు తెలిపారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు భారీ ర్యాలీగా బయలుదేరిన అంగన్‌వాడీలను శ్రీకాకుళంలోని జ్యోతిబాపూలే పార్కు వద్ద పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారి మధ్య చోటు చేసుకున్న తోపులాటలో యూనియన్ జిల్లా కోశాధికారి కల్యాణి స్పృహ కోల్పోయారు. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ధర్నాకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సహా 70 మందిని పోలీసులు అరెస్టు చేశారు.

వేలాది మంది సెలవులు పెట్టుకొని కలెక్టరేట్ వద్ద ధర్నా, వంట, వార్పుతో నిరసన తెలుపుతున్నా జిల్లా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో అంగన్‌వాడీలు విజయనగరంలో జాతీయ రహదారిని దిగ్బంధించారు. దీంతో, డిఎస్‌పి గోవిందరావు జోక్యం మేరకు ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శాంతకుమారి అక్కడికి వచ్చి సమస్యలు అడిగి తెలుసుకొని వారి నుంచి వినతిపత్రం తీసుకున్నారు. సమస్యల పరిష్కారానికి ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.


శ్రీకాకుళంలో అంగన్‌వాడీలను నెట్టివేస్తున్న పోలీసులు


అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

ఏలూరులో వర్షంలో తడుస్తూనే అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగించారు. అధికారులు స్పందించకపోవడంతో పోలీసు వలయాన్ని ఛేదించుకుని బారికేడ్లను తోసుకుని కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. దీంతో, జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణమూర్తి వారి వద్దకు వచ్చి వినతిపత్రం తీసుకున్నారు. అంగన్‌వాడీల ధర్నాకు రెండో రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బాపట్లలోని పాత బస్టాండ్ కూడలిలో అంగన్‌వాడీల మానవహారంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి మాట్లాడుతూ సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగించాలన్నారు. వైఎస్ఆర్ జిల్లా కడప కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్ ప్రసంగించారు. విజయవాడలో జరిగిన ధర్నాకు ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు సంఘీభావం తెలిపారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ మద్దతు తెలిపి ప్రసంగించారు. పుట్టపర్తి, కర్నూలు, నంద్యాల, రాయచోటి, చిత్తూరు, తిరుపతి, మచిలీపట్నం, కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, నరసాపురం, పార్వతీపురం, ప్రకాశం జిల్లా ఒంగోలులో అంగన్‌వాడీల ధర్నా ముగిసింది. అల్లూరి జిల్లాలోని పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటిడిఎల ఎదుట అంగన్‌వాడీలు బైఠాయించారు.

36 గంటల పోరాటానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు
సిఐటియు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

అంగన్‌వాడీలు తమ న్యాయమైన కోర్కెల సాధనకు 36 గంటల పాటు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ధర్నాకు మద్దతుగా నిలిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఐ వెంకటేశ్వరరావు, కెఎస్ లక్ష్మణరావు, ఎపి ఎన్‌జిఒ, ఎల్ఐసి, పోస్టల్, సిఐటియు, దాని అనుబంధ సంఘాలు, రంగాల కార్యకర్తలందరికీ సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బారావమ్మ వేర్వేరు ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థి హత్య?

ప్రజాశక్తి - బుట్టాయగూడెం(పశ్చిమగోదావరి)

బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ బాలుర వసతిగృహం విద్యార్థి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. హత్యకు గురై ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉర్రింకల గ్రామానికి చెందిన గోగుల అఖిల్‌వర్ధన్‌రెడ్డి (11) హాస్టల్‌లో ఉంటూ నాలుగో తరగతి చదువుతున్నాడు. సోమవారం రాత్రి హాస్టల్లో భోజనం చేసి నిద్రపోయాడు. మంగళవారం ఉదయం అఖిల్‌వర్ధన్‌రెడ్డి కనిపించలేదు. వాచ్‌మెన్‌తో కలిసి వెతకగా హాస్టల్ సమీపంలో మృతిచెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసు, రెవెన్యూ, ఐటిడిఎ, ఎంపిడిఒ తదితర అధికారులతో పాటు రాష్ట్ర గిరిజన కమిషన్ సభ్యులు వి.సోమశంకర్ నాయక్, ఎస్‌పి మేరీ ప్రశాంతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అఖిల్ వర్ధన్ రెడ్డిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు తెలుస్తోందని ఐటిడిఎ పిఒ సత్యనారాయణ తెలిపారు. రాత్రి సమయంలో కొందరు వ్యక్తులు హాస్టల్‌కు వచ్చి విద్యార్థులపై టార్చ్‌లైట్ వేసి వెతికినట్లు వార్డెన్ అనుమానం వ్యక్తం చేశారని చెప్పారు. విద్యార్థి మృతిపై విచారణ చేస్తున్నామని చెప్పారు.

పెళ్లింట తీవ్ర విషాదం

మొదటి పేజీ తరువాయి

పలువురు బాధితులు తెలిపారు. ఆ తర్వాత డ్రైవరు వద్ద ఉన్న డోరు నుంచి కొందరం, వెనుక అద్దం పగలగొట్టుకుని మరికొందరం బయటపడ్డామని చెప్పారు. క్షతగాత్రులను 108లో దరిశి ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. ఘటనా స్థలాన్ని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్, ఎస్‌పి మల్లికాగార్గ్, వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పరిశీలించారు.

రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియాను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారని దర్శి ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ తెలిపారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ఇస్తామని పేర్కొన్నారు. స్థానికంగా ఆయన లేకపోవడంతో ఈ మేరకు మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సానుభూతి తెలిపారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

బస్సు ప్రమాదంలో ఏడుగురు మరణించడం పట్ల రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు వేర్వేరు ప్రకటనల ద్వారా మృతుల కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలియజేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటుకు కృషి

యువగళం పాదయాత్రలో లోకేష్ హామీ

ప్రజాశక్తి - నెల్లూరు ప్రతినిధి

తాము అధికారంలోకి రాగానే నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం జలదంకి మండలం కొత్తపల్లిలో ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ హామీ ఇచ్చారు.యువగళం పాదయాత్ర మంగళవారంతో 2000 కిలోమీటర్ల మైలురాయిని చేరుకుంది. ఈ సందర్భంగా కొత్తపల్లిలో శిలాఫలకం ఆవిష్కరించారు. 153వ రోజు పాదయాత్ర కావలి నియోజకవర్గంలోని శ్రీపురం క్రాస్ క్యాంప్ నుంచి ప్రారంభమైంది. కొత్తపల్లి మీదుగా ఉదయగిరి నియోజకవర్గంలోని చోడవరం గ్రామం వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కొత్తపల్లి గ్రామస్తులతో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. లోకేష్ మాట్లాడుతూ..

టిడిపి హయంలో ఎకరా వరి సాగుకు రూ.20,000 పెట్టుబడి అయ్యేదని..జగన్ పాలనలో ఎకరాకు రూ.40,000 అవుతోందని చెప్పారు. సక్సెస్‌కి షార్ట్‌కట్ లేదని కష్టపడి చదివితేనే జీవితంలో విజయం సాధిస్తారని యువతనుద్దేశించి మాట్లాడారు. బాబు అంటే బ్రాండ్... జగన్ అంటే జైలు అని విమర్శించారు. చిత్తూరు జిల్లా కుప్పం వరదరాజ స్వామి గుడి నుంచి ప్రారంభమైన పాదయాత్ర కావలి అసెంబ్లీ నియోజకవర్గం కొత్తపల్లి వద్ద రెండువేల కిలోమీటర్లకు చేరుకోవడం మరపురాని ఘట్టమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో పైలాన్‌ను ఆవిష్కరిస్తున్న లోకేష్

లోకేష్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

నారా లోకేష్ యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లకు చేరుకున్న సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. యువగళాన్ని వినిపిస్తూ.. ప్రజల సమస్యలను ప్రస్తావిస్తూ సాగుతున్న పాదయాత్రను చూసి గర్వపడుతున్నానంటూ ట్వీట్ చేశారు.

అమరావతిపై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరణ

- డిసెంబర్‌కి వాయిదా.. ఆ లోపు విచారణ సాధ్యం కాదు
- స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. అమరావతిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. ఈ అంశంపై అత్యవసర విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అభ్యర్థనలను సుప్రీం ధర్మాసనం తోసిపుచ్చింది. ఇందుకు సంబంధించిన పిటిషన్ల విచారణను ఈ ఏడాది డిసెంబర్‌కు వాయిదా వేసింది. మూడు రాజధానుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ 2022 మార్చి 3న హైకోర్టు తీర్పు ఇవ్వగా దానిని రాష్ట్ర ప్రభుత్వం సవాల్ చేసింది. దీనిపై మంగళవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది ధర్మాసనం విచారించింది. కేసు అత్యవసరంగా విచారణ చేపట్టాలని ఏపి ప్రభుత్వం తరపున మాజీ అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ కోరగా.. సాధ్యం కాదని ధర్మాసనం తేల్చి చెప్పింది.

ఆగస్టు నుంచి నవంబర్ వరకూ రాజ్యాంగ ధర్మాసనాలు ఉన్నందున డిసెంబర్ లోపు అత్యవసర విచారణ సాధ్యపడదని స్పష్టం చేసింది. అమరావతి కేసుపై వాదనలు వినిపించేందుకు 3 గంటల సమయం కావాలని సీనియర్ న్యాయవాది కెకె వేణుగోపాల్ కోరారు. ప్రతివాదులందరికీ నోటీసులు పంపే ప్రక్రియ పూర్తయిందా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ప్రతివాదుల్లో ఇద్దరు మరణించినట్లుగా తమ వద్ద నివేదిక ఉందని, వారు మినహా మిగతా వాళ్లందరికీ నోటీసులు ఇచ్చామని ఏపి ప్రభుత్వం తరపు న్యాయవాది తెలిపారు. అంతేకాకుండా మరణించిన వారిద్దరినీ ప్రతివాదుల జాబితా నుంచి తొలగించాలని సుప్రీం కోర్టుకు దరఖాస్తు పెట్టుకున్నట్లు తెలిపారు. దీనికి సమ్మతించిన ధర్మాసనం వాటి వివరాలను ప్రత్యేకంగా ధర్మాసనం దృష్టికి తీసుకురావాలని ఆదేశించింది. ప్రతివాదులందరికీ నోటీసులు పంపే ప్రక్రియ పూర్తి చేయాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ అప్పీల్‌ను లీడ్ మ్యాటర్‌గా పరిగణిస్తూ తదుపరి విచారణను డిసెంబర్‌కు వాయిదా వేసింది. అయితే, జమ్మూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఆగస్టులో విచారించనుందని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. రాజ్యాంగ ధర్మాసనంలోని ఐదుగురు న్యాయమూర్తులలో జస్టిస్ సంజీవ్ ఖన్నా ఒకరు. అందువల్ల డిసెంబర్ వరకు విచారణ సాధ్యం కాదని అన్నారు.

జీడి రైతులు, కార్మికుల గోడు పట్టదా!

మొదటి పేజీ తరువాయి)

చెప్పుకోవడం తగదు.

విచ్చలవిడి దిగుమతులు- కార్పొరేట్లకు లబ్ధి

కేంద్రంలో మోడీ అధికారానికి వచ్చాక జీడి పరిశ్రమకు గడ్డు రోజులొచ్చాయి. శతాబ్దాల తరబడి పరిశ్రమకు కేంద్ర బిందువుగా ఉన్న కేరళను దెబ్బ తీయాలన్న కక్ష కూడా అందుకు ఓ కారణమై ఉండవచ్చు. దేశీయ ప్రోసెసింగ్ పరిశ్రమకు అవసరమైనంత జీడి పిక్కల ఉత్పత్తి లేదు కనుక విదేశాల నుండి దిగుమతి చేసుకుంటారు. అయితే, అంతర్జాతీయ ధరల ఒడిదుడుకులు, దిగుమతుల మూలంగా దేశీయ రైతాంగం దెబ్బ తినకుండా ఉండేందుకు దిగుమతి సుంకం విధిస్తారు. కానీ మోడీ సర్కారు వచ్చేనాటికి 5 శాతంగా ఉన్న దిగుమతి సుంకాన్ని 2018 ఫిబ్రవరి నుండి 2.5 శాతానికి అంటే సగానికి తగ్గించారు. విదేశీ పిక్కల ధర ఆ మేరకు తగ్గుతుందన్నమాట. వివిధ సరుకులను దిగుమతి చేసుకునే సందర్భంలో అంతకన్నా తక్కువ ధరకు కొనరాదని నిబంధన ఉంది. దాన్ని కనీస దిగుమతి ధర (మినిమమ్ ఇంపోర్ట్ ప్రైస్- ఎంఐపి) అంటారు. దాని ప్రకారం విదేశీ జీడి పప్పును రూ.780, బద్దను రూ.680 కంటె తక్కువకు కొనరాదు. కానీ 2023 ఫిబ్రవరిలో మోడీ సర్కారు దానిని కూడా సడలించి విచ్చలవిడి దిగుమతులకు తలుపులు బార్లా తెరిచింది. ఈ మినహాయింపు కూడా సెజ్‌ల లోని పరిశ్రమలకు కల్పించడంతో వారు చౌకగా భారీ దిగుమతులకు పాల్పడుతున్నారు. ఆ విధంగా కార్పొరేట్ కంపెనీలు ధరల ఒడుదుడుకులకు కారణమవుతున్నాయి. అలాగే జిఎస్‌టి విధానం తెచ్చి అది కూడా 12 శాతం నిర్ణయించడంతో మార్కెట్ తీవ్రంగా దెబ్బ తింది. అనేక ఆందోళనల తరువాత మాత్రమే 5 శాతానికి తగ్గించారు. మోడీ ప్రభుత్వ విధానాల మూలంగా చిన్న పరిశ్రమలు, చిరు వ్యాపారులు నిలదొక్కుకోలేక దివాలా తీసే పరిస్థితులేర్పడ్డాయి.

అంతర్జాతీయంగా ధరల ఒడుదుడుకుల గురించి రెండక్షరాల పత్రిక రాసిందే కాని జీడి పరిశ్రమ నేడెదుర్కొంటున్న సవాళ్లకు ముఖ్య కారణం కేంద్ర ప్రభుత్వ విధానాలని మాత్రం రాయలేదు. మూడక్షరాల పత్రిక కూడా కేంద్రం ఊసెత్తలేదు. ప్రస్తుతం రాష్ట్రంలోని జీడి పరిశ్రమలన్నీ మూతబడి ఉన్నాయి. కార్మికులకు జీవనోపాధి పోగా రైతులవద్ద జీడి పిక్కలు పేరుకుపోతున్నాయి. అయినా గాని హార్టికల్చరల్ డైరెక్టర్ రాష్ట్రంలో ఒక్క జీడి పరిశ్రమ కూడా మూతబడలేదని ప్రకటన ఇస్తే ఆ విషయాన్ని ప్రభుత్వ సమర్థక పత్రిక ప్రముఖంగా ఇవ్వడం ఏం సూచిస్తోంది? రాష్ట్ర ప్రభుత్వ తీరు ఇలా ఉండగా ఇటీవల పలాస ప్రాంతంలో పర్యటించిన ప్రధాన ప్రతిపక్షానికి చెందిన వాణిజ్య విభాగం నాయకుడు కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి పల్లెత్తు మాటాడకపోవడం వారి లొంగుబాటుకు నిదర్శనంగా భావించవలసి ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వం తక్షణం రైతుల నుండి బస్తా జీడి పిక్కలను మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీం ద్వారా రూ. 16,000కు ఆర్‌బికెల ద్వారా కొనుగోలు చేయాలి. వాటిని రాష్ట్రంలోని ప్రోసెసింగ్ పరిశ్రమలకు సరఫరా చేసి ఆ పప్పు మార్కెటింగ్‌కు తోడ్పాటునివ్వాలి. టిటిడి తో సహా అన్ని దేవస్థానాలకూ రాష్ట్రంలో ప్రోసెస్ చేసిన జీడిపప్పు మాత్రమే కొనుగోలు చేయాలి. పంట అభివృద్ధి, పరిశోధనకు తగు చర్యలు చేపట్టాలి. దిగుమతి సుంకాన్ని తిరిగి 5 శాతానికి పెంచేలా, ఎంఐపి అన్ని పరిశ్రమలకూ ఒకేలా ఉండాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి. ఇటువంటి చర్యలు మాత్రమే అటు రైతులకు, ఇటు కార్మికులకు శ్రేయోదాయకం. జీడి పరిశ్రమ, వాణిజ్యం నిలబడతాయి. రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోరుకునే పార్టీలు లేదా పత్రికలు ఇటువంటి వైఖరి చేపట్టడం అవసరం.

సిఐడి చీఫ్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులు సిఐడి చీఫ్‌గా ఇన్‌ఛార్జి హోదాలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ సిఐడి చీఫ్‌గా పనిచేసిన సంజయ్ హృద్రోగ సమస్యతో బాధపడుతూ ఇటీవల సర్జరీ చేయించుకున్నారు. సంజయ్ తిరిగి రాగానే సిఐడి చీఫ్‌గా వస్తారని సిఐడి వర్గాలు పేర్కొన్నాయి.

అఖిలపక్షంతో సిఎం చర్చించాలి

మొదటి పేజీ తరువాయి)

సర్పంచులకు తెలియకుండా బదలాయించుకోవడం చట్టవ్యతిరేకమని అన్నారు.

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుతో పంచాయతీలూ దెబ్బతినిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి వ్యతిరేకంగా పోరాడటం ద్వారానే సర్పంచుల హక్కులు రక్షించుకోవచ్చని అన్నారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచుల పరిస్థితి వాలంటీర్లకన్నా దిగువస్థాయిలో ఉందని అన్నారు. ఎన్నికైన సర్పంచులకు రాజ్యాంగ ప్రకారం ఉండాల్సిన కనీస హక్కులు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ పరిధిలో పనిచేసే ఏ వ్యవస్థ అయినా సర్పంచుల పరిధిలోనే ఉండాలని అన్నారు. వైసిపి ప్రభుత్వం సర్పంచుల నిధులు లాక్కోవడం, విధులను నిర్వహించనీయకపోవడం వంటి చర్యలకు దిగుతోందని అన్నారు. వారికి కుచ్చుటోపీ పెడుతోందని దీనికి వ్యతిరేకంగా ఐక్య ఉద్యమం చేయాలని కోరారు.

పంచాయతీ పరిషత్ అధ్యక్షులు వై.వి.బి.రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ కేంద్రం నుండి చట్ట ప్రకారం వచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వాడేసుకుంటోందని చెప్పారు. దీనిపై నిలదీయాల్సిన కేంద్రం ఆ పనిచేయడం లేదని, పైగా రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడుకోవాలని సర్పంచులకు చెబుతున్నారని విమర్శించారు. ఇది సర్పంచుల సమస్య కాదని, మొత్తం గ్రామీణ ప్రజల సమస్యని అన్నారు.

సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిలకలపూడి పాపారావు మాట్లాడుతూ కేంద్రం నుండి రాష్ట్రానికి నిధులు వచ్చినా కనీస సమాచారం ఇవ్వలేదని, దీనిపై పంచాయతీరాజ్ కమిషనర్, కార్యదర్శులను ఎన్నిసార్లు కలిసినా ఫలితం లేదని అన్నారు. ఆందోళనకు దిగితే అరెస్టులు చేయిస్తున్నారని అన్నారు. అయినా వెనకడుగువేసేది లేదని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచులు కూడా పోరాటంలో కలిసి వచ్చేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. పలు జిల్లాల్లో సర్పంచులు మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు.

సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ పంచాయతీలకు హక్కులు, నిధులు కల్పించాలని కోరుతూ రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం ప్రవేశపెట్టగా దీన్ని అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. మైనర్ పంచాయతీల కరెంటు బిల్లులనూ రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ఇప్పటి వరకూ వాడుకున్న నిధులను వెనక్కు ఇవ్వాలని, కరెంటు బిల్లులు తగ్గించాలని ఆయన కోరారు. అలాగే గ్రామ సచివాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటూ ఖర్చు పంచాయతీలతో పెట్టిస్తోందని ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు.

సిపిఐ ఎంఎల్ న్యూడెమెక్రసీ నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ స్థానిక సంస్థలను ఆదుకోకపోగా చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవ్వాలని కోరారు. ఎంసిపిఐయు నాయకులు ఖాదర్‌భాషా మాట్లాడుతూ సింహం అని చెప్పుకుంటున్న సిఎం సర్పంచుల నిధులు వారికి చెప్పాపెట్టకుండా దొంగదారిన తీసుకోవడం చట్ట విరుద్ధమని అన్నారు. ఇది పూర్తిగా పిరికిపందచర్యని విమర్శించారు. అమ్ఆద్మీ పార్టీ నాయకులు ఫణిరాజు మాట్లాడుతూ ఒకవైపు నిధులు లాగేసుకుంటూ మరోవైపు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపుతున్నారని విమర్శించారు. పరిపాలన అంటే ప్రజలను దోచుకోవడమేనా అని ప్రశ్నించారు. అఖిల భారత పంచాయతీ పరిషత్ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాలు పిఎఫ్ఎంఎస్‌లో చేరాయని, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ మాత్రమే చేరలేదని తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన నిధులను సిఎఫ్ఎంఎస్ ద్వారా దారి మళ్లించుకుంటోందని అన్నారు. పంచాయతీ పాలకవర్గాలకు తెలియకుండా నిధులు తీసుకోవడం సరికాదని, దీనిపై హైకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి విచారించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, సిఐటియు ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్, సిపిఐ నాయకులు దోనేపూడి శంకర్, బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఉప్పలపాడు సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు, కర్నూలు జిల్లాకు చెందిన సర్పంచుల సంఘం నాయకులు బాలపీరా, సర్పంచుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఎన్‌టిఆర్ జిల్లా సర్పంచుల సంఘం నాయకులు, గొల్లమందల తండా సర్పంచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాత్మక బోధన ద్వారా ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : నిర్మాణాత్మక బోధన ద్వారా, భావితరాలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో 259 పాఠశాలలు మాత్రమే సిబిఎస్ఇ అనుబంధంగా ఉండేవని, ప్రస్తుతం వెయ్యి ప్రభుత్వ పాఠశాలలు అనుసంధానం చేయడం ఒక మైలురాయి అని అన్నారు. విజయవాడలోని ఓ హోటల్‌లో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో సిబిఎస్ఇ స్ట్రక్చర్డ్ పెడగాజీ' అనే అంశంపై నాలుగు రోజులపాటు జరగనున్న శిక్షణ తరగతులను కమిషనరు సురేష్‌కుమార్ ప్రారంభించారు.

నేడు ఢిల్లీకి గవర్నర్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం ఢిల్లీ వెళ్లనున్నారు. అధికారిక పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసే అవకాశం ఉంది. అలాగే వివిధ కార్యక్రమాల్లోనూ ఆయన పాల్గొనున్నారు.

రంగనాధ ఆలయంలో ఎసిబి సోదాలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరులో రంగనాయకులపేటలోని శ్రీ రంగనాధస్వామి దేవాలయంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. దేవాలయంలో నగదు, బంగారం అదృశ్యమైనట్లు ఇటీవల కొందరు ఎసిబి అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సోమవారం రాత్రి నుంచి తనిఖీలు చేపట్టారు. గుడిలోని బంగారం, నగదు, ఇతర అదాయ వనరులకు సంబంధించిన లెక్కలను పరిశీలించారు. ఆలయ కమిటీ నిర్వహకులను పలు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. ఎసిబి డిఎస్‌పి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఈ సోదాలు నిర్వహిస్తున్నారు. అయితే ఈ సోదాలపై అధికారులు గోప్యత పాటిస్తున్నారు.

సహకార వ్యవస్థ బలోపేతం

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకార వ్యవస్థను బలోపేతం చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర సహకారశాఖ ఉన్నతాధికారులు, అదనపు, జాయింట్, డిప్యూటీ రిజిస్ట్రారులతో సచివాలయంలో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2042 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో నష్టాల్లో నడుస్తున్న సంఘాలను పునరుద్ధరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అవసరమైనచోట నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటుచేయాలన్నారు. పునరుద్ధరణకు అవకాశం లేని సంఘాలను మూసివేసే అవకాశాలను పరిశీలించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటీకరణ కోసం రూ.79.72 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయాలన్నారు. ఇంటిగ్రేటెడ్ కో-ఆపరేటివ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అమలులో భాగంగా ఫేజ్-3లో రూ.609.39 కోట్ల అంచనా వ్యయంతో తూర్పుగోదావరి, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో చేపట్టిన గోదాములు, కార్యాలయ భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సహకారశాఖ కమిషనరు అహ్మద్‌బాబు, సహకారశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవిచౌదరి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉమ్మడి పౌరస్మృతి పేరుతో

ప్రజల మధ్య బిజెపి చిచ్చు

- ఆగస్టు 14న కార్మిక, కర్షక సంఘాల జనజాగరణ
- ఎఐఎడబ్ల్యుయు నేత బి వెంకట్


సమావేశంలో మాట్లాడుతున్న బి వెంకట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉమ్మడి పౌరస్మృతి పేరుతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు అధ్యక్షతన మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. అనేక ఆర్థిక, సామాజిక అసమానతలు కలిగిన దేశంలో యుసిసి పేరుతో ఆధిపత్య భావజాలాన్ని బలవంతంగా రుద్దేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన మన దేశంలో అసమానతలు అంతరించకుండా ఉమ్మడి పౌరస్మృతి వంటి చట్టాలు దేశానికి ప్రమాదం అని అన్నారు. ఇటువంటి తొందరపాటు నిర్ణయాల వల్లే మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలు ఇందుకు ఉదాహరణ అని చెప్పారు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల మతోన్మాద విధానాలను ప్రతిఘటించేందుకు ఆగస్టు 14న సిఐటియు, కిసాన్‌సభ, వ్యవసాయ కార్మిక సంఘం, దేశవ్యాప్తంగా ఉన్న గ్రామీణ పేదల సంఘాలను కలుపుకుని జన జాగరణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెంకట్ వెల్లడించారు.

సాగు భూముల సాధనకు ఉద్యమించాలి : వి వెంకటేశ్వర్లు

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పేదలకు భూములు పంచుతామని చెప్పడం శుభపరిణామమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. గత దశాబ్దకాలంలో పేదలకు భూములు పంచిన దాఖలాల్లేవని, తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను సెజ్‌లు, ప్రజా ప్రయోజనాల పేరుతో సంపన్నులకు, రియల్ ఎస్టేట్‌దారులకు ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని వ్యవసాయ కూలీల కుటుంబాలకు రెండెకరాల చొప్పున పంచగలిగే భూమి ఉందని కోనేరు రంగారావు కమిషన్ చెప్పిందన్నారు. నిత్యం దేశంలో దళితులు, మహిళలు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయని, వీటిని ప్రతిఘటించేందుకు అన్ని సామాజిక సంఘాలతో కలిసి నెలరోజులపాటు వివక్షకు వ్యతిరేకంగా ఒక సామాజిక ఉద్యమాన్ని నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేసి పేదలను ఆకలి చావుల వైపునకు నెట్టివేసే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 9న క్విట్ వివక్ష పేరుతో నిరసన కార్యక్రమాలు, ఆగస్టు 15న 'సామాజిక వివక్షకు సమాధి కడతాం' అనే పేరుతో కవితా గోష్టులు, వ్యాసరచన పోటీలు, బహుముఖ కార్యక్రమాలు చేపడతామన్నారు. సమావేశానికి ముందుగా ఇటీవల అనారోగ్యంతో మరణించిన కృష్ణా జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి మురాల రాజేష్, ఎం ప్రభాకర్‌కు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు వి శివనాగరాణి, కె లోకనాథం, ఎ రవి, కంకణాల ఆంజనేయులు, ఎం పుల్లయ్య, జె సత్యనారాయణ, ఇ అప్పారావు, కె కల్యాణ్, వెంకన్న, కారెం వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హామీల అమలేదీ? : టిడిపి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

నవరత్నాలు కింద ఇచ్చిన హామీల్లో 98 శాతం నెరవేర్చామని వైసిపి ప్రభుత్వం చెప్పడం ప్రజలను మోసపుచ్చడమే అవుతుందని టిడిపి మాజీ మంత్రి, ప్రస్తుత విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

చంద్రయాన్-3 ప్రయోగంలో స్వల్ప మార్పులు

- 14న ఖరారైన ముహూర్తం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రయాన్-3లో కొన్ని మార్పులు చేసింది. ఇస్రో ఈ నెల 14న ఎల్‌విఎం3-ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే రెండు జాబిల్లి యాత్రలు ముగిశాయి. అవి సాంకేతికంగా ఫెయిల్యూర్ అయినప్పటికీ పరిశోధనలో విజయం సాధించాయి. ఈ సారి చంద్రయాన్-3 సాంకేతికంగానూ సక్సెస్ సాధించాలన్న లక్ష్యంతో ఇస్రో శాస్త్రవేత్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని చంద్రయాన్‌ను రూపొందించారు.

గతంలో జరిగిన జాబిల్లి యాత్రలను ఒక్కసారి పరిశీలిస్తే... 2008 అక్టోబర్ 22న పిఎస్‌ఎల్‌వి సి-11 రాకెట్ ద్వారా చంద్రయాన్-1 ప్రయోగించారు. 1380 కిలోల బరువు ఉన్న ఈ ఉపగ్రహం అదే ఏడాది నవంబర్ 14న చంద్రునిపై దిగి పరిశోధనలు చేయాల్సి ఉంది. అప్పట్లో ఈ ఉపగ్రహంలో ఆర్బిటర్‌తోపాటు మూన్ ఇంపాక్ట్ ప్రోబోను అమర్చి పంపించారు. 312 రోజుల తర్వాత చంద్రయాన్-1తో భూ కేంద్రాలకు సంబంధాలు తెగిపోయాయి. అప్పటి ప్రయోగం 95 శాతం విజయవంతం అయినట్లు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఇక చంద్రయాన్-2 ఉపగ్రహాన్ని 2019 జూలై 22న జిఎస్‌ఎల్‌వి - మార్క్3 రాకెట్ ద్వారా ప్రయోగించారు. వాస్తవానికి ఈ ప్రయోగం జూలై 14న జరపాల్సి ఉన్నప్పటికీ ఆఖరి క్షణంలో సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఎట్టకేలకు జరిగిన ప్రయోగం పాక్షిక విజయాన్ని సాధించింది. చంద్రయాన్-2లో 2,379 కిలోల ఆర్బిటర్, 1,471 కిలోల లాండర్, 27 కిలోల రోవర్లను ఉపయోగించారు. విక్రం పేరుతో నిర్మించిన లాండర్ చంద్రునిపై సాఫ్ట్ ల్యాండింగ్ జరగక పోవడంతో అందులోని ప్రజ్ఞాన్ రోవర్‌తోపాటు నిరూపయోగమైంది. ఆర్బిటర్ మాత్రం చాలా కాలం చంద్రుని చుట్టూ తిరిగి తన పరిశోధనలు అందించింది. అప్పట్లో ఇస్రో శాస్త్రవేత్తలు 98 శాతం ఈ ప్రయోగం విజయవంతమైనట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం చంద్రయాన్-3 లో ఆర్బిటర్‌ను ప్రవేశపెట్టలేదు. కేవలం లాండర్, రోవర్‌లను ఈ ప్రయోగంలో చేర్చారు. 3,900 కిలోల బరువు ఉన్న లాండర్, రోవర్, ఇతర ఉపకరణాలను ఎల్‌విఎం3-ఎం4 భారీ రాకెట్ మోసుకెళ్ళనుంది. ఈ రాకెట్ ప్రయోగానికి 2023 జులై 14న ముహూర్తం కుదిరింది. ఈ ప్రయోగాన్ని పూర్తిగా విజయవంతం చేసి అమెరికా, రష్యా, చైనాలకు ఏమాత్రం తాము తీసిపోమని ప్రపంచానికి ప్రకటించాలని ఇస్రో శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. భారత ప్రభుత్వం 615 కోట్ల రూపాయలను ఇందుకోసం వెచ్చించింది. చంద్రుని దక్షిణ ధృవంపై లాండర్, రోవర్‌లు క్షేమంగా, అత్యంత భద్రంగా, సాఫ్ట్ లాండింగ్ అయితే ఒక మూన్ డేలో జాబిల్లిపై పరిశోధనలు చేసి ప్రపంచ అంతరిక్ష శాస్త్రవేత్తలకు అందించాల్సి ఉంది.

గ్రేడ్-3 ఆలయాల ఇఒల ఉద్యోగోన్నతులు నిలిపివేత

- అర్చకుల వేతనాలు పెంపు
- మంత్రి సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని గ్రేడ్-3 ఆలయాల్లో పనిచేస్తున్న ఇఒలకు ఉద్యోగోన్నతి ఉత్తర్వులను నిలుపుదల చేసినట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో ఇంజినీరింగ్, విద్యుత్తు విభాగాల్లో చాలా వరకు సాంకేతిక సిబ్బంది పోస్టులు భర్తీ చేయాల్సి ఉందన్నారు. ఈ నియామకాలకు సంబంధించి త్వరలో మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. సచివాలయంలో మంత్రి మంగళవారం మీడియాతో మాట్లాడారు. ఆలయాల ఆస్తుల పరిరక్షణకు సెక్షన్ 83లో సవరణలు తీసుకొచ్చామన్నారు. ఎవరైనా ఆలయాల ఆస్తులను ఆక్రమించుకుంటే ఎనిమిదేళ్ల వరకు జైలు శిక్షపడేలా చట్టంలో మార్పులు తెచ్చామన్నారు. రాష్ట్రంలోని పలు ఆలయాల్లో పనిచేస్తున్న 2,625 మంది అర్చకుల వేతనాలను రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచినట్లు వెల్లడించారు. అలాగే రూ.10 వేలు వేతనం ఉన్న అర్చకులకు 15,650కు పెంచినట్లు మంత్రి సత్యనారాయణ తెలిపారు.

దేశం.. సమాజమే ముఖ్యం

- డబ్బు, పదవులతో నన్ను కొనలేరు
- వలంటీర్లపై కోపం లేదు
- ఆడపిల్లల అదృశ్యంపై నోరుమెదపని వైసిపి : పవన్‌కల్యాణ్


ఏలూరులో జనసేన కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'డబ్బు, పదవులతో నన్ను కొనలేరు, రూల్ ఆఫ్ లాను నమ్ముతాను. దేశం, సమాజం తప్ప తనకు ఏమీ తెలియవు..' అని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. వారాహి రెండో విడత యాత్రలో భాగంగా మూడోరోజు ఏలూరులోని క్రాంతి కళ్యాణ మండపంలో ఆయన దెందులూరు, ఉంగుటూరు నియోజవర్గాల నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. వలంటీర్లపై తనకు కోపంలేదని, వారి పొట్టకొట్టాలన్న ఉద్దేశమే లేదన్నారు. న్యాయ, శాసన, బ్యూరోక్రసీ వంటి వ్యవస్థలు ఉండగా సమాంతరంగా మరో వ్యవస్థ ఎందుకని ప్రశ్నించారు. ఉపాధి కార్మికులకు ఇచ్చే వేతనం కూడా వలంటీర్లకు ఇవ్వడం లేదన్నారు. వలంటీర్ వ్యవస్థ, రేషన్ వ్యాన్లు లేకపోతే ఇంతకుముందు దేశం ఆగిపోయిందా? అని ప్రశ్నించారు. వలంటీర్లతో వ్యక్తిగత సమాచారం సేకరించే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. 2019 నుంచి 2021 మధ్యలో 29,279 మంది ఆడపిల్లలు అదృశ్యమైనట్లు పార్లమెంట్‌లోనే లెక్కలు చెప్పారన్నారు. తన వ్యక్తిగత విషయాలపై చర్చాగోష్టులు పెట్టే మీడియా, వేలాది మంది ఆడపిల్లల అదృశ్యంపై చర్చలు ఎందుకు పెట్టడంలేదని ప్రశ్నించారు. ప్రొద్దుటూరులో దళిత బాలికపై అత్యాచారం జరిగితే ఎప్పటికో స్పందించారని, నిందితులను వదిలేశారో? ఉంచారో? కూడా తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉందన్నారు. విషయాన్ని పక్కదోవ పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని పీడిస్తున్న జగన్ అనే జలగను వదిలించుకోవాలన్నారు. మద్యం నుంచి దోచిన రూ.30 వేల కోట్లను వలంటీర్లకు ఇవ్వాలని, వారికి ఉపాధి కల్పించాలని కోరారు. దళితులు జగన్‌ను తమవాడంటూ ఎత్తేశారని, అధికారంలోకి రావడంతోనే విదేశీ విద్యను తీసేశారన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నాదెండ్ల మనోహర్, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, నియోజకర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు రూ.42 కోట్లు

- ప్రభుత్వానికి సచివాలయాలశాఖ విజ్ఞప్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథక నిర్వహణకు 42 కోట్ల రూపాయలు కేటాయించాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కోరింది. ఈ మేరకు ఆ శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ రాశారు. ఈ లేఖలో టీకప్పుల కొనుగోలు నుంచి వాట్సాప్ సందేశాల వరకు అయ్యే వివిధ రకాల ఖర్చును పేర్కొన్నారు. గ్రామ, వార్డు స్థాయిల్లో ప్రజలకు కావాల్సిన వివిధ రకాల సర్టిఫికేట్లను ఈ కార్యక్రమంలో మంజూరు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమ నిర్వహణలో భాగంగా టీ కప్పులు, బాటిల్స్‌కు ఒక్కో గ్రామ, వార్డుకు 2 వేల రూపాయలు కావాలని అధికారులు ప్రతిపాదించారు. సమావేశాల సందర్భంగా కావాల్సిన కుర్చీలు, టేబుళ్ల, మైకు సెట్లకు ఒక్కో సచివాలయానికి రూ. తొమ్మిది వేలు, స్టేషనరీకి రూ. నాలుగు వేలు, మైకు ప్రచారానికి రూ.2,500లు కావాలని కోరారు. వాలంటీర్ల ద్వారా ప్రచారానికి ఐదు లక్షల రూపాయలు అవసరమవుతాయని పేర్కొన్నారు. లబ్ధిదారులలు ఎప్పుడు రావాలో చెప్పేందుకు వాట్సాప్‌ను ఉపయోగించి, అందులో సందేశం పంపించనున్నారు. దీనికోసం ఏకంగా 1.36 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని పేర్కొన్నారు అదే సందేశాన్ని సాధారణ మెసేజ్ రూపంలో పంపించేందుకు ఇంకో 10.50 లక్షలు కావాలని ప్రతిపాదించారు. ఇక మొబైల్ స్టిక్కర్లు వేసేందుకు ఇంకో 2 కోట్లు, డాక్యుమెంట్లపై హాలోగ్రామ్ వేసేందుకు 3 కోట్లు, పాకెట్ కాలండర్లకు 4.95 కోట్ల రూపాయలు కావాలని కూడా ప్రతిపాదించారు.

మార్గదర్శిలో రూ.కోటి పైన నగదు డిపాజిట్ చేసిన ఖాతాదారులకు సిఐడి నోటీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో రూ.కోటి పైన నగదు డిపాజిట్ చేసిన ఖాతాదారులకు సిఐడి మంగళవారం నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు సిఐడి కార్యాలయం మంగళశారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్‌బిఐ, సిబిడిటి నిబంధనల ప్రకారం ఈ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. మార్గదర్శి చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన ఆర్థిక మోసం కేసులపై కొనసాగుతున్న విచారణలో ఇప్పటికే సంస్థ ఎండి, డైరెక్టర్లను ఎపి సిఐడి పలుమార్లు విచారించిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు నోటీసులు అందుకున్న బాధిత చందాదారులందరూ విచారణకు పూర్తిగా సహకరించాలని సిఐడి కోరింది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)/ గన్నవరం (కృష్ణా జిల్లా)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందారు. బాపట్లలో ఇద్దరు విద్యార్థులు, కృష్ణాజిల్లా బాపులపాడులో ఇద్దరు యువకులు మరణించారు. బాపట్ల జిల్లా ఇమ్మిడిశెట్లపాలేనికి చెందిన అజయ్ కుమార్ (20), దేశాయిపేట ఐటిఐ సిలోన్ కాలనీకి చెందిన గౌరి సూర్య వర్ధన్ (19) వేటపాలెంలోని సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేశారు. సర్టిఫికెట్లు తెచ్చుకునేందుకు ఇద్దరూ కలిసి బైక్‌పై కాలేజీకి బయలుదేరారు. చల్లారెడ్డిపాలెం బైపాస్ జంక్షన్ వద్దకు చేరుకోగానే చీరాల వైపు కోళ్లతో వెళ్తున్న వ్యాను అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు ఇద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వ్యాన్ బోల్తా పడడంతో దాని డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గతేడాది చెల్లి..ప్రస్తుతం అన్న..

రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన సూర్యవర్ధన్ తల్లిదండ్రులు రవికుమార్, కుమారిల శోకం ఎవరూ తీర్చలేనిది. గతేడాది సెప్టెంబరు 26న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం సొకులేరు వాగులో సూర్యవర్ధన్ సోదరి సువర్ణకమల ప్రమాదవశాత్తు కొట్టుకు పోయి.. మృతి చెందారు. ఇప్పుడు అన్న సూర్యవర్ధన్ రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. పిల్లలిద్దరూ రెండు ప్రమాదాల్లో చనిపోవడంతో ఆ దంపతులు కన్నీరుమున్నీరవుతున్నారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా చింతలపాలెం గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు బోలేరో వాహనంలో యానాంకు బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం ఉమామహేశ్వరపురం వద్ద అర్ధరాత్రి రోడ్డు పక్కన వాహనాన్ని ఆపారు. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఐషర్ వ్యాన్ బోలేరోను ఢీకొట్టింది. ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందగా..మరొకరు గాయపడ్డారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు హర్ష

ఎన్‌ఇపిని రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులను విద్యకు దూరం చేసే నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం విజయనగరంలో ఆందోళన నిర్వహించారు. తొలుత ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి ఎత్తు బ్రిడ్జి వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎం.హర్ష, జె.రవి కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దొంగ చాటుగా తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం విద్యార్థులను శాస్త్రీయమైన విద్య వైపు కాకుండా అశాస్త్రీయమైన విద్య వైపు తీసుకెళ్తుందని విమర్శించారు. ధర్నాలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.సౌమ్య, పట్టణ అధ్యక్షులు రాజు, జిల్లా కమిటీ సభ్యులు సమీర, లావణ్య పాల్గొన్నారు.

ఎపి, తెలంగాణ మధ్య 50:50 నిష్పత్తిలో నీటి పంపకం చేయాలి

కేంద్ర మంత్రికి హరీష్‌రావు విజ్ఞప్తి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య 50:50 నిష్పత్తిలో నీటి పంపకాన్ని సవరించాలని మంత్రి టి హరీష్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర జల శక్తిశాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వరద జలాలను ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏకపక్షంగా, పోలవరం ప్రాజెక్టులో భాగమైన కొత్త ప్రాజెక్టులను నిర్మిస్తోందని ఫిర్యాదు చేశారు. కుడి ప్రధాన కాలువ, ఎడమ ప్రధాన కాలువ విస్తరణ జరుగుతుందని, తద్వారా ఈ కాలువల క్యారేజీ సామర్థ్యం చట్టబద్ధంగా అనుమతించబడిన దానికంటే రెండు నుండి మూడు రెట్లు ఎక్కువ నీటిని కలిగి ఉంటుందని తెలిపారు.

ఎఐతో 90 శాతం ఉద్యోగాలు ఫట్

స్టార్టప్ దుకాన్‌లో సిబ్బందికి ఎసరు

న్యూఢిల్లీ : వ్యాపారులు తమ స్వంత ఇ-కామర్స్ పోర్టల్‌ను ఏర్పాటు చేసుకోవడానికి మద్దనిచ్చే స్టార్టప్ సంస్థ దుకాన్ తమ ఉద్యోగుల్లో 90 శాతం మందికి ఉద్వాసన పలికింది. వీరి స్థానంలో కృత్రిమ మేధా(ఎఐ)ని ఉపయోగించు కోవాలని నిర్ణయించింది. కస్టమర్ సపోర్ట్ టీమ్‌లో 90 శాతం ఉద్యోగుల స్థానంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్‌తో రిప్లేస్ చేస్తున్నట్లు దుకాన్ ఫౌండర్, సిఇఒ సుమిత్ షా సోషల్ మీడియాలో వెల్లడించారు. దీంతో తమకు 85 శాతం ఖర్చులు తగ్గనున్నాయన్నారు. ట్విట్టర్‌లో ఆయనపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది సిగ్గు, మానవత్వం లేని చర్య అని నెటిజన్లు విమర్శలు గుప్పించారు. మైక్రోసాఫ్ట్‌లో 10వేల మందికి ఉద్వాసన పలుకుతున్నామని ఈ ఏడాది ప్రారంభంలో ఆ కంపెనీ ప్రకటించింది. వీటికి అదనంగా మరోమారు కోతలకు సిద్ధం అవుతోందని తెలుస్తోంది. తాజా తొలగింపుల్లో భాగంగా వాషింగ్టన్ కార్యాలయంలోని ఉద్యోగుల్లో 276 మందిని ఇంటికి పంపించిందని సమాచారం. రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఉద్యోగుల తొలగింపులు ఉండొచ్చని రిపోర్ట్‌లు వస్తోన్నాయి.

సంపాదకీయం

ఫ్రాన్స్ పరిణామాలు

'స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం' అన్న నినాదాన్ని ప్రపంచానికందించిన ఫ్రెంచి విప్లవం నాటి స్ఫూర్తి అదే గడ్డపై మంటగలవడం క్షంతవ్యం కాదు. పదిహేడేళ్ల ముస్లిం యువకుడు నహేల్ ట్రాఫిక్ పాయింట్‌లో కారు ఆపలేదని ఫ్రాన్స్ రాజధాని పారిస్ నగర శివార్లలో కాల్చిచంపడంతో మొదలైన ఆగ్రహ జ్వాల నేటికీ రగులుతూనే ఉంది. పోలీసులు పెద్దఎత్తున రంగంలోకి దిగి, వేలమందిని అరెస్టు చేస్తున్నా, లాఠీఛార్జి, టియర్ గ్యాస్ ప్రయోగిస్తున్నా... అల్లర్లు ఆగడం లేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతుంది. రోజురోజుకూ తీవ్రమవుతున్న ఆర్థిక - సామాజిక అసమానతలు, శ్వేత జాతియేతరుల పట్ల తీవ్రమైన వివక్ష దీనికి ప్రధాన కారణం కాగా, ఉక్రెయిన్ సంక్షోభం, ఆర్థికంగా దిగజారడంతో కనీస ఆదాయాలు పడిపోవడం, పెన్షన్ సంస్కరణలు...ఇలా జనంలో ప్రభుత్వంపై గూడుకట్టుకున్న అసంతృప్తి మరో కారణం.

తల్లితోపాటు పారిస్‌లో నివసిస్తున్న అల్జీరియా-మొరాకో సంతతికి చెందిన నహేల్ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో కారు ఆపకుండా వెళ్లిపోవడానికి ప్రయత్నించగా, ఏ నేర చరిత్రా లేని ఆ కుర్రాడిని శ్వేత జాతి దురహంకారం తలకెక్కించుకున్న ఓ పోలీసు అధికారి ఎటువంటి విచక్షణా లేకుండా కాల్చేశాడు. అదే శ్వేత జాతి యువకుడైతే కచ్చితంగా ఆ పనిచేసేవాడు కాదని ఫ్రెంచి ప్రజలు నమ్ముతున్నారు. ఈ వీడియో వైరల్ కావడంతో ప్రజానీకంలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఫ్రాన్స్‌లో పట్టణాలు, నగరాల చుట్టూ శివార్లలో అల్పాదాయ వర్గాలు నివసించే 'బాన్ల్యూ'లు ఉంటాయి. ఇక్కడ నివసించే వారిలో అత్యధికులు అల్జీరియా, మొరాకో, ట్యునీషియాలో వందల ఏళ్లపాటు ఫ్రెంచి పాలకుల దోపిడీకి గురైన వారు. కనీస ప్రాథమిక సౌకర్యాలకు సైతం నోచని వీరు అక్కడ శ్రమశక్తిలో కీలకం. 2021 నాటికి ఫ్రాన్స్ జనాభాలో 10.7 శాతంగా అంటే 70 లక్షలమంది వలస దారులున్నారు. రాజ్యాంగం పౌరసత్వాన్ని గొప్పగా నిర్వచించినా... పోలీసు వ్యవస్థ వివక్ష చూపడం సర్వసాధారణం. న్యాయవ్యవస్థ కూడా నల్లజాతీయుల ప్రాణాలకు, హక్కులకు విలువనివ్వకపోవడం కనిపిస్తోంది. పేరు, నివసిస్తున్న ప్రాంతం తెలిస్తే వారికి ఉపాధి లభించదు. మితవాద పార్టీలు వారిని శత్రువులుగా చూపి రాజకీయంగా ఎదుగుతున్నాయి. ఈ వైఖరి శ్వేతజాతియేతరుల్లో అభద్రతను పెంచింది. పశ్చిమ దేశాల్లో అమెరికా తరువాత ఫ్రాన్స్‌లోనే పోలీసుల చేతిలో ఎక్కువమంది మరణిస్తున్నారు. 2020లో అమెరికాలో నల్లజాతి యువకుడు జార్జి ఫ్లాయిడ్‌ను ఊపిరాడకుండా చేసి చంపిన శ్వేతజాతి దురహంకార పోలీసు అధికారి దాష్టీకంపై పెల్లుబికిన ఆగ్రహం తరహాలోనే తాజాగా నహేల్ ఆందోళనలు కొనసాగాయి. 2005లో పోలీసులు వెంబడిస్తుండటంతో ఇద్దరు ముస్లిం బాలురు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో దాక్కుని మరణించడంతో ప్రారంభమైన అల్లర్లు చివరికి అత్యయిక పరిస్థితికి దారితీశాయి. ఫ్రాన్స్‌లో పోలీసులు ఆదేశించినప్పుడు వాహనం ఆపకున్నా, బెదిరించినా నిర్దాక్షిణ్యంగా కాల్చివేసేందుకు అనుమతిస్తూ 2017లో చేసిన సవరణ పోలీసులకు అపరిమిత అధికారాల్ని కట్టబెట్టింది. 2020 నుంచి ఏటా సగటున 44 మంది పోలీసుల చేతుల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. వీరిలో అత్యధికులు శ్వేత జాతియేతరులే. ట్రాఫిక్ జంక్షన్ల వద్ద కాల్పుల్లో గత ఏడాది 13 మంది మరణించగా, ఈ ఏడాది ఇది మూడో హత్య.

ఫ్రాన్స్ సమాజంలో సంపద పంపిణీ, అవకాశాల్లో భారీ అంతరాలున్నాయి. వాటిని సరిచేసి శ్వేత జాతియేతరులకు సమాన అవకాశాలు కల్పించడంలో మాక్రాన్ ప్రభుత్వం విఫలమవడంతో రావణకాష్టం రగిలింది. మన రాజ్యాంగ పీఠికలో సైతం స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని చేర్చుకున్నాం. ఈ మూల సూత్రాల అమలులో ఫ్రాన్స్‌కంటే భిన్నమైన పరిస్థితులేవీ మనదేశంలో కనిపించడం లేదు. మణిపూర్‌లో రెండు నెలలుగా చిచ్చు రగులుతూనే ఉన్నా ప్రధాని కనీసం నోరు మెదపకపోవడం చూస్తున్నాం. అమెరికా, ఇతర ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్యం గురించి గొప్పలు చెప్పి 24 గంటలైనా కాకముందే తన మనుషుల అధీనంలో ఉండే భారతీయ ఆర్మీ మేజర్ ఒకరు ఈద్ పండగ రోజున కాశ్మీర్‌లోని పుల్వామా జిల్లా జదూరా గ్రామంలోని మసీదులోకి చొరబడి అక్కడి వారితో 'జై శ్రీరామ్' అని బలవంతంగా నినాదాలు ఇప్పించిన ఘటన వెలుగులోకి వచ్చింది. బహుళ సంస్కృతిని కాపాడుకోవాలి. ఈ విషయంలో ఫ్రెంచ్ ప్రజలు చూపిన తెగువ అభినందనీయం. ఫ్రాన్స్ పరిణామాలు మన దేశంతోపాటు అనేక దేశాలకు కనువిప్పు కావాలి. వివిధ జాతులు, మతాలు, వర్ణాలు, వర్గాలతో వైవిధ్యభరితమైన ప్రజానీకమున్న మనదేశం వారి ఆకాంక్షలకు తగినట్టుగా మలచుకోవాలి. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే చట్టం, ఒకే సంస్కృతి పేరుతో భారతదేశ బహుళత్వాన్ని దెబ్బతీసే ఎలాంటి చర్యలను అనుమతించరాదు.

మహనీయుని మాట



పిల్లలు ఆడుకుంటున్నప్పుడు మనం వారి ఆకాంక్షలను గమనిస్తూ వుండాలి. వాటిని మనం చేయూతనిస్తే...ఆ పిల్లలే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా తయారవుతారు.

- గిజుభాయి, ప్రసిద్ధ విద్యావేత్త.

ఏకరూపత వర్సెస్ సమాన హక్కులు

విశ్లేషణ



బృందా కరత్

మహిళల హక్కుల కోసం సాగిన సంఘ సంస్కరణల ఉద్యమాలు చారిత్రాత్మకంగా పురుషుల ప్రత్యేక హక్కు ఏకరూపతపై పోరాడాయి. ఈ దిశగా పడిన ప్రతి అడుగుకూ నిర్దిష్టమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ నేపథ్యం వుంది. భారతదేశంలో, అదీ మన స్వాతంత్ర్యం లభించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, మహిళల హక్కులు చాలావరకు మెరుగైనప్పటికీ, ఆ హక్కులకు సంబంధించిన చట్టపరమైన చట్రపరిధి ఇప్పటికీ ఇంకా వివక్షలు, పక్షపాతాలు, సాంస్కృతిక భేదాభిప్రాయాలతో మగ్గుతోంది. ఇంకా జరగాల్సింది చాలా వుందనడంలో కొంచెం కూడా సందేహ పడాల్సిన అవసరం లేదు. అయితే, 2023వ సంవత్సరంలో భారత్‌లో ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఏది ఉత్తమమైన మార్గం అన్నది ప్రశ్న.

ఒక దేశం, ఒక చట్టం అన్న నినాదంతో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేయాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. భారతదేశ పరిస్థితుల్లో ఒకే చట్టమంటే లింగ న్యాయంతో సమానం కాదు. అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకూ సమాన హక్కులు సాధించాలన్న లక్ష్యాన్ని చేరేందుకు రెండంచెల వ్యూహాన్ని సిపిఎం సమర్థిస్తోంది. అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకూ వర్తించే ప్రస్తుతమున్న లౌకిక చట్టాలను బలోపేతం చేసి, విస్తరించాలన్నది మొదటి వ్యూహం. అన్ని కమ్యూనిటీల స్త్రీ, పురుషుల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, ఆయా కమ్యూనిటీల పర్సనల్, సాంప్రదాయ చట్టాల్లో సంస్కరణల దిశగా ఉద్యమించేందుకు హామీ కల్పించడమన్నది రెండో వ్యూహం. దీనివల్ల ఆ యా కమ్యూనిటీల పరిధిలో మహిళలకు సమాన హక్కులు లభిస్తాయి. అంటే హిందూ పురుషులు, హిందూ మహిళలు, ముస్లిం పురుషులు, ముస్లిం మహిళలు, అలాగే గిరిజన పురుషులు, గిరిజన మహిళల మధ్య సమాన హక్కులు లభిస్తాయి. అలాగే కమ్యూనిటీల మధ్య అంటే హిందువులు, ముస్లింలు, గిరిజనులు, పార్శీలు, క్రైస్తవులు, సిక్కులు తదితరాల మధ్య సమాన హక్కులు లభిస్తాయి. దీనిపై కూలంకషంగా కసరత్తు చేసిన తర్వాత, 2016లో మోడీ ప్రభుత్వం జస్టిస్ బి.ఎస్.చౌహాన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన 21వ లా కమిషన్ ఇదే రీతిలో నిర్ధారణకు వచ్చింది. 'కుటుంబ చట్టాల సంస్కరణలు' శీర్షికతో 2018 ఆగస్టులో తీసుకువచ్చిన కన్సల్టేషన్ పేపర్‌లో ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.


లా కమిషన్ నిర్ధారణలు

ఉమ్మడి పౌర స్మృతి అమలును పరిశీలించాల్సిందిగా ప్రభుత్వం లా కమిషన్‌ను ప్రత్యేకంగా కోరింది. ఇది "అవసరమూ కాదు, వాంఛనీయమూ కాదు" అంటూ లా కమిషన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. ప్రత్యేక వివాహ చట్టం, గృహ హింస నిరోధక చట్టం తదితర లౌకిక చట్టాలను బలోపేతం చేసి, విస్తరించాలంటూ మొదటగా ఈ కమిషన్ సవివరమైన సిఫార్సులు చేసింది. ఇక రెండోది, హిందువులు, ముస్లింలు (సున్నీలు, షియాలు రెండు వర్గాలు), క్రైస్తవులు, పార్శీలు, సిక్కులు, వివిధ రకాలైన గిరిజన కమ్యూనిటీలకు వర్తించే విభిన్నమైన వ్యక్తిగత (పర్సనల్), సాంప్రదాయ చట్టాలను సవివరమైన రీతిలో అధ్యయనం చేసిన తర్వాత, వివాహం, విడాకులు, పిల్లల సంరక్షణ, దత్తత, వారసత్వం వంటి కీలకమైన కుటుంబ చట్టాలపై సిఫార్సులు చేసింది. విభిన్న కమ్యూనిటీల పర్సనల్ చట్టాల పరిధిలో లక్షిత సంస్కరణలు తీసుకురావాలని పేర్కొంది.

చర్చలు, సంప్రదింపులు విస్తృతంగా జరిపిన తర్వాత, 75,378 స్పందనలు కమిషన్‌కు అందాయి. సమాన చట్టాల కోసం అన్ని కమ్యూనిటీల మహిళల పోరాటాలను కచ్చితంగా ముందుకు తీసుకెళ్ళగలిగేలా అత్యంత ఉపయుక్తమైన నిర్దిష్ట ప్రణాళిక (బ్లూ ప్రింట్)ను కమిషన్ రూపొందించింది. ప్రస్తుతమున్న హిందూ పర్సనల్ చట్టాల్లో హిందూ మహిళలు ఎదుర్కొంటున్న అనేక వివక్షలను ఈ నివేదిక వివరించింది. సహ భాగస్వామి లేదా సహ వారసత్వం అన్న హిందూ చట్ట భావనను రద్దు చేయాలని సిఫార్సు చేసింది. 2005 సంస్కరణ తీసుకువచ్చిన తర్వాత కూడా మహిళలకు దీనివల్ల అన్యాయం జరుగుతోందని పేర్కొంది. హిందూ అవిభాజ్య కుటుంబం భావన నుండి వచ్చిన పన్ను మినహాయింపులను కూడా రద్దు చేయాలని సిఫార్సు చేసింది. కేవలం ముస్లింలకే సంస్కరణలు అవసరమని చెబుతున్న బిజెపి నేతల అభిప్రాయాలకు భిన్నంగా లా కమిషన్ పై సిఫార్సులు చేసినందునే ఆ నివేదికను చెత్త బుట్ట దాఖలు చేశారా?

మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు తీసుకునే పద్ధతిని నిషేధించి 'మన ముస్లిం కుమార్తెలకు' సాయం చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోంది. కానీ, తలాక్‌ను ముఖ్యమైన మతాచారం కాదంటూ అది చట్టవిరుద్ధమని ప్రకటించింది సుప్రీంకోర్టని...లా కమిషన్ తన నివేదికలో పేర్కొనడం బహుశా మోడీ ప్రభుత్వానికి మరింత ఇబ్బందికరంగా పరిణమించి వుండవచ్చు. మోడీ ప్రభుత్వ చట్టాన్ని నేరుగా విమర్శించకుండా, గృహ హింసను నివారించడంపై పౌరచట్టం నిబంధనలను వర్తింపచేయడం ద్వారా ముస్లిం బాధిత మహిళను కాపాడేందుకు చర్యలు తీసుకోవడం అవశ్యమని లా కమిషన్ పేర్కొంది. ఎందుకంటే...మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం మహిళలకు ఎలాంటి ఉపశమనాన్ని ఇవ్వకుండా, కేవలం ముస్లిం పురుషులను జైలుకు పంపుతుంది.

తన ఎజెండాను అమలు చేయడానికి సంకుచిత రాజకీయ పరిశీలనలను అనుమతిస్తూ, మోడీ ప్రభుత్వం ఈ విలువైన నివేదికను పట్టించుకోకపోవడం అత్యంత దురదృష్టకరం. 2018లో ఈ నివేదికను ప్రభుత్వానికి అందచేశారు. ఏ ఒక్క చట్టాన్ని తీసుకురాకుండా లేదా ఏ కమ్యూనిటీకి కూడా పర్సనల్‌లా లో సంస్కరణలు తీసుకువచ్చేందుకు తీవ్ర స్థాయిలో చర్చలు, సంప్రదింపులు జరపకుండానే మోడీ ప్రభుత్వం తన రెండవ దఫా పదవీ కాలాన్ని మొత్తంగా వృధా చేసింది. యుసిసిని రుద్దేందుకు చేసిన ప్రయత్నాన్ని 21వ లా కమిషన్ తిరస్కరించిన తర్వాత, ఎలాంటి కారణాలు లేకుండానే, మరోసారి ఈ అంశాన్ని పరిశీలించాలంటూ జస్టిస్ రీతూ రాజ్ అవస్థి నేతృత్వంలో 22వ లా కమిషన్‌ను ఏర్పాటు చేశారు. దాంతో మరోసారి అభిప్రాయాలు తెలియచేయాల్సిందిగా కోరారు. ఇదంతా కేవలం ప్రజల సమయాన్ని, ధనాన్ని వృధా చేయడమే. కమిషన్‌ను తన స్వంత విధుల నుండి, ప్రాధాన్యతల నుండి పక్కకు మళ్ళించడమే. అయితే మోడీ ప్రభుత్వ హయాంలో, ఈ అసంబద్ధత కూడా సాధ్యమే. ఇక్కడ మహిళల హక్కులకు సంబంధించి చర్యలు తీసుకోవాలన్నది వారి ఎజెండా కాదని, సమాజంలో చీలిక తెచ్చేందుకుగాను ఎన్నికల ఎజెండాతో ముందుకెళ్ళడానికే ఇదంతా అన్నది సుస్పష్టం.



మహిళలందరి సమానత్వాన్ని పెంచగల-మహిళా రిజర్వేషన్ బిల్లు, కుల దురహంకార నేరాల వ్యతిరేక చట్టం, వివాహ కాలంలో (వివాహ సమయంలో సంపాదించుకున్న ఆస్తులన్నింటికీ ఉమ్మడి యాజమాన్యం) ఏర్పాటు చేసుకున్న ఆస్తులన్నింటికీ కమ్యూనిటీ ఆఫ్ ప్రాపర్టీ లా, వైవాహిక బంధంలో అత్యాచారాన్ని నేరపూరితంగా ప్రకటించే చట్టం - వంటి పెండింగ్‌లో వున్న లౌకిక చట్టాలను అలక్ష్యం చేయడమో లేదా తిరస్కరించడమో చేస్తోంది. మోడీ ప్రభుత్వం తన మొదటి పదవీ కాలంలో గానీ లేదా రెండవ పదవీ కాలంలో కానీ ఇప్పటి వరకు మహిళల అనుకూల చట్టాన్ని ఒక్కటంటే ఒక్కటి కూడా తీసుకురాలేదు.

గిరిజనుల చట్టపరమైన నిబంధనలను నిర్వీర్యం చేయడం

ఇటీవల భోపాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ, ఉమ్మడి పౌర స్మృతిని తీసుకు రావడానికి తమ ప్రభుత్వ కృతనిశ్చయాన్ని మరోసారి చెప్పుకొచ్చారు. దీన్ని వ్యతిరేకించే వారందరూ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఒకే ఇంట్లో ఒక సభ్యుడికి ఒక చట్టం, మరో సభ్యుడికి మరో చట్టం వుంటే, ఆ ఇల్లు లేదా కుటుంబం నడపగలమా? అటువంటపుడు ద్వంద్వ వ్యవస్థతో దేశాన్ని ఎలా పాలించగలం? అని ఆయన ప్రశ్నించారు. ఆయన అవగాహనలో లక్ష్యంగా చేసుకున్న ద్వంద్వ వ్యవస్థ అంటే ముస్లిం కమ్యూనిటీ పర్సనల్ చట్టాలు. అందుకే ఆయన పదేపదే మన ముస్లిం కుమార్తెలంటూ ప్రస్తావిస్తున్నారు.

కానీ ఇక్కడ ఈ ద్వంద్వ వ్యవస్థలను మనకు అందచేసింది భారత రాజ్యాంగమనే విషయం భారత ప్రధానికి తెలియదని అనుకోగలమా? భారత్‌కి సంబంధించినంతవరకు దురదృష్టవశాత్తూ ప్రధాని రాజ్యాంగబద్ధమైన కళ్ళద్దాల్లో నుండి దేశాన్ని చూడడం లేదు. సంఘ పరివార్ రాజకీయ కళ్ళద్దాల్లో నుండి చూస్తున్నారు. అందువల్లే, ప్రధాని మొత్తంగా ముస్లిం కమ్యూనిటీ పట్ల తనకు గల మతపరమైన వ్యామోహాన్ని అధిగమించి మరీ, ఉమ్మడి పౌర స్మృతిని దేశంలో విధించడం వల్ల తలెత్తే పర్యవసానాల గురించి ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తున్నారు.

"రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌కు సంబంధించి (ఉమ్మడి పౌర స్మృతి) సాధ్యాసాధ్యాలనేది మొట్టమొదటగా కనిపించే సమస్యగా వుంది." అని లా కమిషన్ తన నివేదికలో స్పష్టంగా పేర్కొంది (పేరా 1.23). త్రిపుర, అస్సాం, మిజోరాం, మేఘాలయలో నిర్దిష్ట ప్రాంతాలకు వర్తించే 244వ అధికరణం కింద ఆరవ షెడ్యూల్ ప్రత్యేకంగా జిల్లా, ప్రాంతీయ మండళ్ళను ఏర్పాటు చేసింది. ఈ షెడ్యూల్ కింద వివాహం, విడాకులు, ఆస్తి హక్కులు వంటి కుటుంబ చట్టాలతో సహా పలు అంశాలపై గవర్నర్ అనుమతితో శాసనాలు రూపొందించే హక్కు వుంది. అదనంగా, 371ఎ, బి, సి, ఎఫ్, జి, హెచ్ అధికరణలు, ఆరు ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హక్కులు, మినహాయింపులను అందచేస్తున్నాయి. ఉదాహరణకు, 371ఎ అధికరణం నాగా తెగలకు, 371జి మిజో తెగలకు సంబంధించినది. సాంప్రదాయ చట్టానికి సంబంధించిన మతపరమైన, సామాజిక ఆచారాలు, సాంప్రదాయాలు, పౌర న్యాయం, క్రిమినల్ న్యాయం వంటి వాటిని కాపాడేందుకు ప్రత్యేక నిబంధనలను ఈ రెండు అధికరణలు అందిస్తున్నాయి. తమ సాంప్రదాయ చట్టానికి సంబంధించి తమ రాజ్యాంగ హక్కులను ప్రభావితం చేసేలా ఏ చర్యలైనా తీసుకునేటపుడు ఈశాన్య ప్రాంతంలోని ఈ రాష్ట్రాల్లో గిరిజన తెగలు ఎలా ప్రతిస్పందిస్తాయి? ఇప్పటికే మణిపూర్ కొండ ప్రాంత గిరిజనుల వంటి వారు అనేక విషయాల్లో దెబ్బతిన్నారు. ఐదవ షెడ్యూల్ ఏరియాల్లో, షెడ్యూల్ ఏరియాలకు పంచాయితీ విస్తరణ చట్టాన్ని (పిఇఎస్ఎ) చేయడం ద్వారా గ్రామ సభలకు చట్టపరమైన హక్కులు ఇవ్వబడ్డాయి. స్వయం పాలన ద్వారా సాంప్రదాయ, సామాజిక ఆచారాలకు రక్షణ కల్పించబడింది. మధ్య, తూర్పు భారతంలో గిరిజన కమ్యూనిటీలు ఇప్పటికే నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల దాడులకు గురయ్యాయి. ఈ విధానాలు వారి అటవీ భూములను లాక్కుంటున్నాయి. ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేయాలని చూడడం వల్ల భారతదేశవ్యాప్తంగా గిరిజన తెగల రాజ్యాంగ, చట్ట నిబంధనలతో ప్రత్యక్ష ఘర్షణ తలెత్తుతుంది.

ముందుగా దీనిపై ప్రధాని సమాధానం చెప్పాలి. ద్వంద్వ వ్యవస్థలకు, గిరిజన తెగల రాజ్యాంగ, చట్ట నిబంధనలకు ప్రధాని, ఆయన ప్రభుత్వం, పార్టీలు వ్యతిరేకమా? ఉమ్మడి పౌర స్మృతిని బలవంతంగా రుద్దేందుకుగాను ఆయన ఈ రక్షణలన్నింటినీ రద్దు చేయాలని చూస్తున్నారా? లేదా గిరిజన తెగలకు కాకుండా కేవలం ముస్లింలకు మాత్రమే ఉమ్మడి పౌర స్మృతి వర్తిస్తుందా? వీటిపై ప్రధాని తన వైఖరిని స్పష్టం చేయాల్సి వుంది.

/వ్యాసకర్త సిపి(ఐ)ఎం పొలిట్‌బ్యూరో సభ్యులు/

/మిగతా భాగం రేపటి సంచికలో/

స్వీడన్ నాటో సభ్యత్వానికి మెలిక పెట్టిన టర్కీ!

అంతర్జాతీయం



ఎం. కోటేశ్వరరావు

ఐరోపా సమాఖ్య తలుపులు తెరుస్తారేమోనని ఐదు దశాబ్దాలుగా గుమ్మం ముందు పడిగాపులు కాస్తున్నాం. సమయం వచ్చింది గనుక చెబుతున్నా మాకు సమాఖ్యలో సభ్యత్వానికి అంగీకరిస్తే మేము నాటోలో స్వీడన్ ప్రవేశానికి అడ్డుతొలుగుతామని టర్కీ అధ్యక్షుడు రిసెప్ తాయిప్ ఎర్డోవాన్ సోమవారం నాడు మెలిక పెట్టాడు. లిథువేనియా రాజధాని విలినస్‌లో మంగళ, బుధవారాల్లో జరగనున్న నాటో కూటమి వార్షిక సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లే ముందు టీవీలో చెప్పాడు. ఆదివారం నాడు తాను అమెరికా అధినేత జోబైడెన్‌తో చర్చలు జరిపినపుడు ఈ అంశాన్ని స్పష్టం చేసినట్లు కూడా వెల్లడించాడు. ఈ అనూహ్య ప్రకటనతో పశ్చిమ దేశాలు కంగారు పడ్డాయి. ఇలా వివాదపడితే అంతిమంగా రష్యా అధినేత వ్లదిమిర్ పుతిన్ లబ్ధి పొందుతాడంటూ నష్ట నివారణకు పూనుకున్నాయి. మరోవైపున సోమవారం నాడే విలినస్‌లో ఎర్డోవాన్-స్వీడన్ ప్రధాని క్రిస్టెర్‌సన్ భేటీ జరిగింది. తరువాత స్వీడన్‌కు చారిత్రాత్మక క్షణం అంటూ తమ దేశ టీవీలో ప్రకటించినట్లు వార్తలు వచ్చాయి. కొత్త మెలిక తప్ప గతంలో విధించిన షరతులను టర్కీ పునరుద్ఘాటించలేదు గనుక మద్దతు ఖాయం అని భావించిందా లేక ఎర్డోవాన్ విలినస్ చేరుకున్న తరువాత తెరచాటు మంత్రాంగం ఏదైనా జరిగిందా అన్నది ఇది రాస్తున్న సమయానికి వెల్లడి కాలేదు. వైఖరిని మార్చుకున్నట్లు టర్కీ నుంచి ఎలాంటి సూచనా లేదు.

విలినస్ సమావేశాల్లో స్వీడన్ ప్రవేశానికి ఆమోద ముద్ర కూడా ఎజెండాలో ఉంది. టర్కీ దానికి మోకాలడ్డటంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పోరు ముగిసేంత వరకు నాటోలో ఉక్రెయిన్ చేరకూడదని అమెరికా అధినేత జో బైడెన్ చేసిన ప్రకటన కూడా తలనొప్పిగా మారింది. టర్కీ షరతులను తాము అంగీకరించేది లేదని ఐరోపా సమాఖ్య ప్రకటించగా స్వీడన్‌కు ఆమోదం తెలిపితేనే తాము ఎఫ్ 16 యుద్ధ విమానాలను టర్కీకి విక్రయిస్తామని అమెరికా మెలిక పెట్టింది. "ముందు ఐరోపా సమాఖ్యలో టర్కీ చేరికకు మార్గాన్ని సుగమం చేయాలి, తరువాత ఫిన్లండ్ మాదిరి స్వీడన్‌కూ మేము దారి ఇస్తాము. మేము 50 సంవత్సరాలుగా గేటు ముందు వేచి చూస్తున్నాం, నాటో లోని దేశాలన్నీ దాదాపు సమాఖ్యలో సభ్యులే" అని ఎర్డోవాన్ చెప్పాడు. తమ దేశంలో వేర్పాటు వాదులు, కర్దిష్ వర్కర్స్ పార్టీ వంటి ఉగ్రవాదులను స్వీడన్ బలపరుస్తున్నదని, ఖురాన్ దహనంతో సహా ఇస్లాం వ్యతిరేక ప్రదర్శనలను అనుమతించిన కారణంగా తాము అంగీకరించేది లేదని గతంలో టర్కీ ప్రకటించింది. ఇప్పుడు తమకు ఐరోపా సమాఖ్యలో సభ్యత్వానికి లంకె పెట్టింది. టర్కీని సంతుష్టీకరించేందుకు స్వీడన్ ఉగ్రవాద చట్టాల్లో మార్పు చేసింది. వాటితో టర్కీ సంతృప్తి చెందలేదు.



నాటో జనరల్ సెక్రటరీతో ఎర్డోవాన్

> **తమ దేశంలో వేర్పాటు వాదులు, కర్దిష్ వర్కర్స్ పార్టీ వంటి ఉగ్రవాదులను స్వీడన్ బలపరుస్తున్నదని, ఖురాన్ దహనంతో సహా ఇస్లాం వ్యతిరేక ప్రదర్శనలను అనుమతించిన కారణంగా తాము అంగీకరించేది లేదని గతంలో టర్కీ ప్రకటించింది. ఇప్పుడు తమకు ఐరోపా సమాఖ్యలో సభ్యత్వానికి లంకె పెట్టింది. టర్కీని సంతుష్టీకరించేందుకు స్వీడన్ ఉగ్రవాద చట్టాల్లో మార్పు చేసింది. వాటితో టర్కీ సంతృప్తి చెందలేదు.**

ప్రపంచ రాజకీయాల్లో టర్కీ అనుసరిస్తున్న విధానాలే దానికి అమెరికా యుద్ధ విమానాల విక్రయం, ఐరోపా సమాఖ్యలో చేర్చుకొనేందుకు ప్రధాన ఆటంకాలుగా ఉన్నాయి. తాజా పరిణామాలకు వస్తే 2016లో ఎర్డోవాన్‌ను పదవి నుంచి దించేందుకు ఒక విఫల కుట్ర జరిగింది. తరువాత తన పదవిని సురక్షితం కావించుకొనేందుకు చేసిన రాజ్యాంగ సవరణలతో మానవ హక్కులు, చట్టపరమైన ఆటంకాలను కల్పిస్తున్నట్లు వాటిని తొలగించి నిబంధనలన్నింటినీ పూర్తి చేస్తేనే చేర్చుకుంటామని సమాఖ్య చెబుతోంది. వీటి కంటే పుతిన్‌తో స్నేహం, ఇతర అంశాలు ప్రధానంగా పని చేస్తున్నాయని చెప్పవచ్చు. సిరియాలో పశ్చిమ దేశాలు మద్దతు ఇస్తున్న కిరాయి మూకలు, ఉగ్రవాదులను అణచేందుకు రష్యా తోడ్పడుతున్నది, దానికి టర్కీ మద్దతు ఇస్తున్నది. ఉక్రెయిన్ సంక్షోభాన్ని సృష్టించింది, దాన్ని కొనసాగించాలని చూస్తున్నది పశ్చిమ దేశాలు కాగా తాను మధ్యవర్తిగా ఉంటానని టర్కీ ముందుకు రావటం వాటికి సుతరామూ ఇష్టం లేదు. టర్కీకి అవసరమైన మిలిటరీ పరికరాలను నాటో, అమెరికా నుంచి కొనుగోలుకు వీల్లేకుండా ఆంక్షలు విధించారు. సిరియా నుంచి ఐరోపాకు వచ్చే 40 లక్షల మంది కాందిశీకులను రాకుండా చేసినందుకు ఇప్పటి వరకు ఐరోపా సమాఖ్య బిలియన్ల మేర యూరోలను అందచేసింది. మరో ఆరు బిలియన్లను అందచేసేందుకు కుదిరిన ఒప్పందాన్ని టర్కీ నిలిపివేసింది. ఐరోపా సమాఖ్య తల మీద తుపాకి గురిపెట్టినట్లుగా తమ షరతులను అంగీకరించకపోతే ఇతర ఐరోపా దేశాలకు కాందిశీకుల వరద పారిస్తామని టర్కీ బెదిరిస్తున్నది. ఈ పూర్వరంగంలో స్వీడన్ సభ్యత్వాన్ని అవకాశంగా తీసుకొని తన ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నది.

ఎర్డోవాన్ పెట్టిన మెలికను ఐరోపా కమిషన్ తిరస్కరించింది. స్వీడన్ నాటోలో, టర్కీ ఐరోపా సమాఖ్యలో చేరటం రెండూ వేర్వేరని, సమాంతరంగా జరుగుతున్న పరిణామాలు గనుక ఒకదానికి మరొకదాన్ని పోటీ పెట్టరాదని ప్రతినిధి దానా సిపినాంట్ స్పష్టం చేసింది. జర్మన్ ఛాన్సలర్ షల్జ్ కూడా ఆ వైఖరిని బలపరిచాడు. టర్కీ కోర్కెను తాను సమర్థిస్తున్నట్లు నాటో ప్రధాన కార్యదర్శి జేన్స్ స్టోల్టెన్‌బర్గ్ చెప్పాడు. స్వీడన్ చేరికను టర్కీ బలపరుస్తుందని కూడా అన్నాడు. ఎర్డోవాన్ మెలిక పెట్టినప్పటికీ ఇప్పటికీ ఆమోదించే అవకాశం ఉందనే ఆశాభావం వెల్లడించాడు. విస్తరణకు సంబంధించి 2022 నివేదికలో సమాఖ్య పేర్కొన్న అంశాలు టర్కీ చేరిక అంత తేలిక కాదని స్పష్టం చేస్తున్నాయి. అక్కడ ప్రజాస్వామ్యం క్షీణిస్తున్నదని, చట్టబద్ధపాలన, ప్రాథమిక హక్కులు, స్వతంత్ర న్యాయ వ్యవస్థల గురించి తీవ్ర ఆందోళన వెల్లడించింది.

గ్రీసును బెదిరించకుండా ఉండేట్లైతే, నాటోలో స్వీడన్ చేరికను ఆమోదిస్తే తాము టర్కీకి ఎఫ్ 16 విమానాలను విక్రయించేందుకు సిద్ధమే అని అమెరికా గతంలో సందేశం పంపింది. విలినస్‌కు బయలుదేరిన జో బైడెన్ ఆదివారం నాడు విమానం నుంచే ఎర్డోవాన్‌తో గంటసేపు సంభాషించినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని అమెరికా అధికారవర్గాలు చెప్పినట్లు వార్తలు. గ్రీసు పట్ల శతృత్వం, రష్యా నుంచి క్షిపణి రక్షణ వ్యవస్థలను కొనుగోలు చేసేందుకు టర్కీ నిర్ణయించిననందున ఎఫ్-16 విమానాలను విక్రయించకూడదని గతంలో అమెరికా నిర్ణయించింది. ఇప్పుడు ఒక అడుగు దిగివచ్చినట్లు కనిపిస్తోంది. స్వీడన్ చేరికకు మద్దతు ఇస్తే టర్కీకి విమానాలు విక్రయించేందుకు అమెరికా పార్లమెంటు ఆమోదించవచ్చని వార్తలు వచ్చాయి. వాటిని తమకు వ్యతిరేకంగా వినియోగించరాదని గ్రీసు డిమాండ్ చేస్తోంది. ఏజియన్ సముద్ర జలాల్లో నౌకా సంచార హక్కుల గురించి వివాదం ఉంది. తమ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘిస్తూ రోజూ తమ దీవుల మీదుగా విమానాలు ఎగురుతున్నట్లు గ్రీసు చెబుతున్నది. ఆ దీవుల మీదుగా ఎఫ్16 విమానాలను అనుమతించకూడదని ఆరుగురు అమెరికన్ ఎంపీలు తమ విదేశాంగ మంత్రికి లేఖలు రాశారు.

విలినస్ నాటో వార్షిక సమావేశాల్లో ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధ సాయం గురించి తప్ప నాటోలో ప్రవేశం మీద ఎలాంటి నిర్ణయమూ తీసుకొనే అవకాశం లేదు. అక్కడ పోరు ముగిసిన తరువాతే దాన్ని గురించి పరిశీలిస్తామని జో బైడెన్ సిఎన్ఎన్ టీవీతో చెప్పాడు. నాటో కుటుంబంలో ఉక్రెయిన్‌ను చేర్చుకోవాలా వద్దా అనే అంశం మీద సభ్యదేశాల్లో ఏకీభావం లేదని కూడా అన్నాడు. ఇప్పుడు గనుక చేర్చుకుంటే మేమంతా యుద్ధంలో ఉన్నట్లే అవుతుంది. ఇప్పుడే ఓటింగ్ జరపాలనటం అపరిపక్వత అవుతుంది, ఒక దేశాన్ని చేర్చుకోవాలంటే ప్రజాస్వామీకరణతో సహా కొన్ని అర్హతలు ఉండాలి అని కూడా బైడెన్ చెప్పాడు. జర్మనీ కూడా అమెరికా వైఖరితో ఏకీభవిస్తోంది. నాటో నిబంధన ఐదును పరీక్షించే అవకాశం పుతిన్‌కు ఇవ్వకూడదని జర్మనీ కోరుకొంటోందని ప్రభుత్వ వర్గాలు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ఉక్రెయిన్‌కు తక్షణమే నాటో సభ్యత్వం అన్న చర్చ అసంగతం, దానికి చేస్తున్న మంచిని మరచి దీని గురించి చర్చను అనుమతించటం విచారకరం. ఎవరూ ఇప్పటికిప్పుడు నాటోలో చేరాలని గట్టిగా చెప్పటం లేదు, దానికి తగిన మార్గం గురించి మాట్లాడుతున్నాం, ఇప్పుడు ఎలా సాయం చేయాలా అని ఆలోచిస్తున్నాం. దీని గురించి గాక సభ్యత్వం గురించి చర్చ పెట్టటం అంటే సమావేశాన్ని పక్కదారి పట్టించటమే, పశ్చిమ దేశాల్లో విబేధాలు ఉన్నట్లు అని చెప్పటమే, దీన్ని రష్యా స్వాగతిస్తుందని నాటో అధికారులు చెప్పినట్లు మీడియా పేర్కొన్నది.

తమను వెంటనే నాటోలో చేర్చుకోవాలని, ఆధునిక అస్త్రాలను పెద్ద ఎత్తున సరఫరా చేయాలని ఉక్రెయిన్ డిమాండ్ చేస్తున్నది. అదే గనుక జరిగితే ఉక్రెయిన్ సంక్షోభ స్వభావమే మారిపోతుంది. పుతిన్ మీద నేరుగా ఆ కూటమి సేనలు యుద్ధానికి దిగవచ్చు. రష్యా దాడులకు దిగక ముందున్న పరిస్థితి వేరు, తరువాత తమ ప్రాంతాలను ఆక్రమించుకున్నందున నాటో సభ్యత్వం ఇవ్వాలని గతేడాది సెప్టెంబరులో జెలెన్‌స్కీ దరఖాస్తు చేశాడు. అనేక దేశాలు అందుకు మద్దతు తెలిపినా అమెరికా, జర్మనీ సిద్ధం కాలేదు. కొన్ని ప్రాంతాలు ఉక్రెయిన్ నుంచి వేరుపడి స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. క్రిమియా ద్వీపం తమదే అంటూ 2014 లోనే రష్యా స్వాధీనం చేసుకుంది. మరికొన్ని ప్రాంతాలు ఇప్పుడు దాని ఆధీనంలో ఉన్నాయి, అటువంటపుడు మధ్యలో సభ్యత్వం ఇవ్వటం, గతం నుంచి వర్తింపచేసి ఎదురు దాడులకు పూనుకోవటం నాటో ఐదవ ఆర్టికల్ నిబంధన పరిధి లోకి రాదని చెబుతున్నారు. దాన్ని సవరించి నాటోలో చేర్చుకొని రష్యాతో నేరుగా తలపడేందుకు నాటో కూటమి ప్రస్తుతం సిద్ధంగా లేదన్నది స్పష్టం. ★

జనవాక్యం

జనరల్ బోగీలు ఏవీ?

సామాన్యుడు ఈ రోజు ఆర్టీసీ చార్జీలు భరించలేక రైళ్లలో పోదామనుకుంటే, అక్కడన్నీ రిజర్వేషన్ పెట్టెలు, ఏసీ పెట్టెలూ దర్శనమిస్తాయి. జనరల్ బోగీ వెనక ఒకటి, ముందు ఒకటి ఉంటుంది. అవి కిటకిటలాడుతూ ఉంటాయి. ఉసూరుమంటూ ఇంకొక రైలులో పోదామనుకుంటే అదీ అంతే! ఈ మధ్య పాసెంజర్ రైళ్ళను ఎక్స్‌ప్రెస్ రైళ్ళుగా మార్చి, అందులో కూడా జనరల్ పెట్టె ఒకటి వెనక, ఒకటి ముందూ. ఈ మధ్య ప్రధాని మోడీ గారు రకరకాల నూతన రైళ్ళను ప్రారంభించాడు. అవన్నీ కూడా ఎ.సి రైళ్ళే. ఇలాంటి పరిస్థితుల్లో రైల్వే మంత్రికి ఒక విజ్ఞప్తి. మీరు ఒక మంత్రి వేషంలో కాకుండగా, సామాన్యునిగా వచ్చి జనరల్ బోగీ ఎక్కండి. సామాన్యుని బాధ ఏంటో తెలుస్తుంది. అయినా టికెట్ కొన్న తరువాత సీటు చూపించాల్సిన బాధ్యత రైల్వేవారిదే. అంత జ్ఞానం రైల్వే అధికారులకు ఉన్నదని అనుకోవడం లేదు. తరువాత రైళ్లలో సీనియర్ సిటిజన్లకి రాయితీలు తీసివేశారు. మోడీగారికి సీనియర్ సిటిజెన్ల మీద ఎంత ప్రేమ! ఇకనైనా ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలుకి సగం జనరల్ బోగీలు తగిలించాలని ప్రజలు కోరుతున్నారు.

- నార్నె వెంకట సుబ్బయ్య.

'మనీలాండరింగ్' పరిధిలోకి జిఎస్‌టి నెట్‌వర్క్

- ప్రతిపక్షాల తీవ్ర అభ్యంతరం
- 50వ జిఎస్‌టి కౌన్సిల్‌లో గందరగోళం


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వాలను కానీ, రాజకీయ పక్షాలను కానీ సంప్రదించకుండానే, ఎటువంటి ముందస్తు సమాలోచనలు జరపకుండానే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మరో ఏకపక్ష నిర్ణయాన్ని బలవంతంగా రుద్దేసింది. వస్తు, సేవల పన్ను నెట్‌వర్క్ (జిఎస్‌టి-ఎన్)ను మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) పరిధిలోకి చేర్చింది. దీనిపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు భగ్గుమన్నాయి. 'మీ పాటికి మీరు ఏకపక్ష నిర్ణయాలు నిరంకుశంగా రుద్దుతూ పోతే ఇక ఈ కౌన్సిల్‌తో పనేంటి?' అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ పరిణామాలతో న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన 50వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో కాసేపు గందరగోళం నెలకొంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన మంగళవారం నాడిక్కడ విజ్ఞాన్ భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఐటి సిస్టమ్ సంస్కరణలపై ప్రజెంటేషన్ అనంతరం జిఎస్‌టిఎన్‌ని పిఎంఎల్‌ఎ కింద చేర్చడంపై ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక, కేరళ, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. కాగా కొన్ని వస్తువులు, సేవలకు సంబంధించిన జిఎస్‌టిని సవరిస్తూ కౌన్సిల్ నిర్ణయాలు చేసింది.

బెంగాల్, మహారాష్ట్రలో అప్పిలేట్ ట్రిబ్యునళ్లు

పశ్చిమ బెంగాల్‌లో రెండు, మహారాష్ట్రలో ఏడు అప్పిలేట్ ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేసేందుకు కౌన్సిల్ నిర్ణయించినట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. కౌన్సిల్ సమావేశ అనంతరం నేషనల్ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహారాష్ట్రలో మొదటి దశలో నాలుగు జిఎస్‌టిఎటి బెంచ్‌లు, రెండవ దశలో మరో మూడు జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్‌లు ఎక్కువగా రాష్ట్రాల రాజధాని నగరాల్లో, హైకోర్టు బెంచ్‌లు ఉన్న చోట ఏర్పాటు చేయనున్నామని ఆమె చెప్పారు.

సినిమా హాళ్లలో కాస్త ఊరట !

ప్రత్యేక వైద్య అవసరాల కోసం ఆహారం (ఎఫ్‌ఎస్‌ఎంపి) వంటి ఫార్మా ఉత్పత్తులపై జిఎస్‌టిని మినహాయించినట్లు తెలిపారు. కాగా సినీ ప్రేక్షకులకు కాస్త ఊరట నిచ్చే కబురును మంత్రి తెలియజేశారు. సినిమా హాళ్లలో విక్రయించే ఆహార పదార్థాలపై జిఎస్‌టి రేటును 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. కాగా ప్రయివేటు అంతరిక్ష పరిశోధన సంస్థలకు మరో నజరానా ప్రకటించారు. ప్రైవేట్ సంస్థలు ప్రయోగించే ఉపగ్రహాలపై జిఎస్‌టి పూర్తిగా మినహాయింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంయువిలపై 22 శాతం సెస్ విధించడాన్ని కౌన్సిల్ ఆమోదించినట్లు తెలిపారు. కరిగే పేస్ట్, ఎల్‌డి స్లాగ్ సహా నాలుగు వస్తువులపై రేట్లను 18 శాతం నుండి 5 శాతానికి తగ్గించామని తెలిపారు.

క్యాసినోలపై 28 శాతం జిఎస్‌టి

ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోలపై ఇక నుంచి 28 శాతం జిఎస్‌టి విధించనున్నట్లు తెలిపారు. అయితే ప్రత్యేక పరిశ్రమను లక్ష్యంగా చేసుకొని ఈ నిర్ణయం చేయలేదని మంత్రి వ్యాఖ్యానించారు. పర్యాటక రంగంలో క్యాసినో కీలక భాగమని ఆమె అన్నారు. జిఎస్‌టి కౌన్సిల్ ఉద్దేశ్యం కాసినోతో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమను లేదా రాష్ట్రాలను దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదన్నారు. అయితే దీనిపై కొన్ని రాష్ట్రాలు ఆందోళనలను వ్యక్తం చేశాయని పేర్కొన్నారు.

బ్రిజ్ భూషణ్ శిక్షార్హుడే

- ఛార్జిషీటులో ఢిల్లీ పోలీసులు వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) చీఫ్, బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై మహిళా రెజ్లర్లు చేసిన ఆరోపణలకు బలం చేకూరుతోంది. అతనిపై నమోదైన అన్ని కేసుల్లో శిక్షార్హుడేనని ఢిల్లీ పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులో తెలిపారు. బాధితులను లైంగికంగా వెంటబడి వేధించినట్లు ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో బ్రిజ్ భూషణ్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. సింగ్‌కు వ్యతిరేకంగా ఆరు కేసులు నమోదయ్యాయి. బాధితులను నేరపూరితంగా బెదిరించడం, మహిళల గౌరవం, మర్యాదలను భంగపరచడం, లైంగిక వేధింపులు, వెంటాడటం వంటి నేరాలకు ఆయన పాల్పడినట్లు ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు ఈ కేసులను నమోదు చేసి, దర్యాప్తు చేశారు. ఓ బాధితురాలిపై సింగ్ వేధింపులు పదే పదే కొనసాగినట్లు అభియోగాలు మోపారు. రెండు కేసుల్లో ఆయనపై ఐపిసి సెక్షన్లు 354, 354ఎ, 354డి ప్రకారం ఆరోపణలు నమోదయ్యాయి. మిగిలిన కేసుల్లో ఐపిసి సెక్షన్లు 354, 354ఎ ప్రకారం ఆరోపణలు నమోదయ్యాయి. ఈ కేసులు రుజువైతే అతనికి ఐదేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. 108 మంది సాక్షులను ప్రశ్నించినట్లు, వీరిలో 15 మంది ఈ ఆరోపణలను సమర్థించినట్లు ఢిల్లీ పోలీసులు ఈ ఛార్జిషీటులో పేర్కొన్నారు. ఈ 15 మందిలో రెజ్లర్లు, కోచ్‌లు, రిఫరీలు ఉన్నారని తెలిపారు. ఇదిలావుండగా, ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు బ్రిజ్ భూషణ్‌కు సమన్లు జారీ చేసింది. ఈ నెల 18న హాజరుకావాలని ఆదేశించింది. దేశంలోని అగ్రశ్రేణి రెజ్లర్లు వినేష్ ఫోగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పూనియా నేతృత్వంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళనలు సాగిన సంగతి తెలిసిందే. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, క్రీడల శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ రెజ్లర్లతో చర్చలు జరిపి, జూన్ 15 నాటికి సింగ్‌పై ఛార్జిషీట్ దాఖలయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ సుప్రీం కోర్టు జోక్యంతోనే బ్రిజ్ భూషణ్‌పై కేసులు నమోదయ్యాయి. ఇప్పుడు రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ కొనసాగుతోంది.

రాజకీయాల్లోకి వస్తే నటించను..

- విఎంఐ ఆఫీస్ బేరర్లతో విజయ్



చెన్నయ్ : ప్రముఖ నటుడు విజయ్ మంగళవారం నాడు చెన్నయ్‌లో జరిగిన విజయ్ మక్కల్ ఐయక్కం (విఎంఐ) ఆఫీస్ బేరర్ల సమావేశంలో పాల్గొన్నారు. తమిళనాడులో దీనిపై ఇది చర్చనీయాంశమైంది. భవిష్యత్‌లో రాజకీయ నాయకుడిగా రావాలా? లేదా నటుడిగా కొనసాగాలా? అనే అంశంపై తేల్చుకునేందుకే ఆయన ఈ సమావేశానికి హాజరైనట్లు సమాచారం. 'రాజకీయాల్లోకి ప్రవేశిస్తే ఇక అక్కడ నుంచి సినిమాల్లో నటించను. సినిమాల్లో నటిస్తున్నంత కాలం రాజకీయాల్లోకి రాను' అని ఆయన అన్నట్లు విఎంఐ ఆఫీస్ బేరర్ ఒకరు తెలిపారు. విజయ్ నటించిన 'లియో' చిత్రం అక్టోబరులో విడుదల కానుంది. వెంకట్ ప్రభు దర్శకత్వంలో మరో చిత్రాన్ని కూడా ఆయన చేయాల్సివుంది. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల నాటికి ఆయన రాజకీయ ప్రవేశం చేసేవీలుందని అభిమానులు చెబుతున్నారు.

హెలికాప్టర్ కుప్పకూలి ఆరుగురు మృతి

ఖాట్మండు : తూర్పు నేపాల్‌లో ఎవరెస్ట్ పర్వతానికి సమీపంలో మంగళవారం ప్రైవేట్ కమర్షియల్ హెలికాప్టర్ కూలిన ఘటనలో ఆరుగురు మరణించారని విమానాశ్రయ అధికారులు తెలిపారు. మరణించిన వారిలో ఐదుగురు మెక్సికన్ కుటుంబానికి చెందినవారే. ఉదయం 10.04గంటల సమయంలో సోలుకుంభ జిల్లాలో సూర్కె విమానాశ్రయం నుండి హెలికాప్టర్ బయలుదేరింది. తొమ్మిది నిముషాలు గడిచిన తర్వాత 12వేల అడుగుల ఎత్తులో వున్నపుడు అకస్మాత్తుగా సంబంధాలు తెగిపోయాయని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయ మేనేజర్ జ్ఞానేంద్ర భుల్ తెలిపారు. సుదూర పర్వత ప్రాంతంలో లాంజురా ఏరియాలో హెలికాప్టర్ కూలిపోయింది. సంఘటనా స్థలం వద్దే ఆరు మృత దేహాలు పడివున్నాయని విమానాశ్రయ ప్రతినిధి ఏక్‌నాథ్ సితాలా తెలిపారు. పర్వత ప్రాంతంలో కాసేపు విహరించిన తర్వాత వారు సూర్కె నుండి ఖాట్మండుకు తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారిలో కెప్టెన్ చేత్ బహదూర్ కూడా వున్నారు. వాతావరణం సరిగా లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భారత్‌లో తగ్గిన పేదరికం

- ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి
- గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫలితమే : నిపుణులు

న్యూయార్క్ : భారతదేశంలో పేదరికం గణనీయంగా తగ్గిందని ఐక్యరాజ్య సమితి నివేదిక పేర్కొంది. 15 ఏళ్ళ కాలంలో మొత్తంగా 41.5 కోట్ల మంది దారిద్ర్యం నుండి బయటపడ్డారని తెలిపింది. ప్రపంచంలోనే అధిక జనాభా కలిగిన దేశం 2005-2006 నుండి 2019-2021 మధ్య కాలంలో ఈ విషయంలో గణనీయమైన పురోగతి సాధించిందని ఆ నివేదిక పేర్కొంది. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం వల్లే పేదరికం తగ్గుముఖం పట్టడానికి ప్రధానకారణమని గ్రామీణాభివృద్ధి రంగ నిపుణులు విశ్లేషించారు. 2006లో ప్రారంభమైన ఈ పథకం పూర్తిస్థాయిల్లో అమల్లోకి వచ్చిన నాటి నుంచే పేదరికం తగ్గుముఖం పడుతూ వచ్చిందని పేర్కొంటున్నారు. ఇటువంటి విశిష్టమైన ఈ పథకంపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కక్ష కట్టినట్టు నిర్వీర్యం చేస్తోందని, ఐక్యరాజ్యసమితి నివేదిక చూసైనా మోడీ సర్కార్ కళ్లు తెరవాలని వారు పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్టంగా అమల్జేయడంతో పాటు పట్టణాలకు కూడా విస్తరింపజేయాలని డిమాండ్ చేశారు.


ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి), ఆక్స్‌ఫర్డ్ పావర్టీ అండ్ హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ (ఒపిహెచ్ఐ)లు ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో అంతర్జాతీయ బహుముఖ దారిద్ర్య సూచిక (ఎంపిఐ)ను విడుదల చేశాయి. భారత్‌తో సహా 25 దేశాలు 15 ఏళ్ళ కాలంలో తమ అంతర్జాతీయ ఎంపిఐ విలువలను విజయవంతంగా సగానికి సగం తగ్గించాయని నివేదిక పేర్కొంది. కంబోడియా, చైనా, కాంగో, హోండూరాస్, భారత్, ఇండోనేషియా, మొరాకో, సెర్బియా, వియత్నాం ఈ జాబితాలో వున్నాయి. 142.86 కోట్ల జనాభాతో భారత్ ఏప్రిల్‌లో చైనాను అధిగమించి అధిక జనాభా కలిగిన దేశంగా మారింది. 2005-06లో 55.1 శాతంగా వున్న దారిద్ర్యం 2019-21 నాటికి 16.4 శాతానికి తగ్గింది. పేదరికాన్ని నిర్మూలించడమన్నది సాధించవచ్చని ఈ నివేదిక తెలియచేస్తోంది. అయితే, కోవిడ్ సమయంలో సమగ్ర డేటా కొరవడడంతో తక్షణావకాశాలను అంచనా వేయడంలో సవాళ్లు ఎదుయ్యాయని ఆ నివేదిక పేర్కొంది.

దుర్భర దారిద్ర్యంలో 110 కోట్ల మంది

110 దేశాల్లో 610 కోట్ల మందిలో 110 కోట్ల మంది దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని నివేదిక వెల్లడించింది. సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాల్లో అయితే ప్రతి ఆరుగురిలో ఐదుగురు పేదరికంలో మగ్గుతున్నారని తెలిపింది. పేదల్లో దాదాపు మూడింట రెండు వంతుల మంది (73కోట్ల మంది) మధ్యాదాయ దేశాల్లో జీవిస్తున్నారు. ఈ దేశాల్లో చర్యలు తీసుకోవడం అంతర్జాతీయంగా దారిద్ర్యాన్ని తగ్గించడానికి కీలకం. తక్కువ ఆదాయం కలిగిన దేశాలు మొత్తం జనాభాలో కేవలం 10 శాతమే వున్నప్పటికీ అక్కడ 35 శాతం మంది పేదలు నివసిస్తున్నారు. 18 ఏళ్ళలోపు పిల్లల్లో దారిద్ర్యం రేటు 27.7 శాతంగా వుంది. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం వేధిస్తోంది. పేదల్లో 84 శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే జీవిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాలే దారిద్ర్యంలో మగ్గుతున్నాయి.

'అటవీ' బిల్లుపై ఆరుగురు ప్రతిపక్ష సభ్యుల అసమ్మతి

న్యూఢిల్లీ : అటవీ సంరక్షణ (కన్జర్వేషన్) సవరణ బిల్లుపై 31 సభ్యులతో కూడిన సంయుక్త పార్లమెంటరీ కమిటీలోని ప్రతిపక్షాలకు చెందిన ఆరుగురు సభ్యులు తమ అసమ్మతిని తెలియజేశారు. ముసాయిదా బిల్లులో భూ బదలాయింపు విస్తరణకు సంబంధించిన అనేక అభ్యంతరాలు లేవనెత్తినా..వివాదస్పదమైన ఈ బిల్లుకు ఎటువంటి మార్పులుచేర్పులు సూచించకుండానే పచ్చజెండా ఊపడం పట్ల వారు తమ అసమ్మతిని వ్యక్తం చేశారు. ఈ బిల్లును ఈ నెల 20న ప్రారంభమయ్యే వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టే వీలుంది. అసమ్మతి నోట్ ఫైల్ చేసినవారిలో కాంగ్రెస్ ఎంపీలు ప్రద్యూత్ బర్దోలి (లోక్‌సభ), ఫులో దేవీ నేతం (రాజ్యసభ), తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు జవహార్ సర్కార్ (రాజ్యసభ), సజ్దా అహ్మద్ (లోక్‌సభ), డిఎంకె ఎంపీలు టిఆర్ బాలు, ఆర్ గిరిరాజన్ ఉన్నారు. అటవీ సంరక్షణ చట్టం 1980కి సవరణలు చేయాలని ఈ బిల్లును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ముందుకు తీసుకొచ్చింది. అటవీ భూములను అటవీయేతర వాటికి అడ్డుఅదుపూ లేకుండా బదలాయించడాన్ని, దుర్వినియోగం చేయడాన్ని అడ్డుకోవడానికి అటవీ సంరక్షణ చట్టం తీసుకొచ్చారు. ఇప్పుడు ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసి అటవీయేతర కార్యక్రమాలకు అటవీ భూములను బదలాయించడం ద్వారా కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టాలని మోడీ సర్కార్ అనేక సవరణలను ప్రతిపాదిస్తోంది. దీనిని నిరసిస్తూ ప్రతిపక్షాల సభ్యులు తమ అసమ్మతి తెలియజేశారు. దేశ సరిహద్దు రేఖ నుంచి 100 కిలోమీటర్ల వరకూ ఉన్న భూములను ఎటువంటి ఆంక్షలు లేకుండా బదలాయించేందుకు సవరణలు ప్రతిపాదిస్తున్నారని, వ్యూహాత్మక లైనర్ ప్రాజెక్టుల చేపట్టేందుకు వీటిని చేపడుతున్నట్లు పేర్కొంటున్నారని తృణమూల్, కాంగ్రెస్ ఎంపీలు పేర్కొన్నారు. సరిహద్దు భద్రత పేరిట కంపెనీలకు అటవీ భూములను దోచిపెట్టేందుకే ఈ ప్రతిపాదన చేస్తున్నారని, సరిహద్దు రేఖ నుంచి 100 కిలోమీటర్ల దూరం అని పేర్కొనడంలోనే వారి ఎత్తుగడను అర్థం చేసుకోవచ్చని వారు విమర్శించారు. ప్రత్యేకించి హిమాలయాలు, ట్రాన్స్ హిమాలయాలు, ఈశాన్య ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొనే ఈ ప్రతిపాదన చేసినట్లు వారు పేర్కొన్నారు. సరైన సంప్రదింపులు జరపకుండా ఇలాంటి నిర్ణయాలను అమల్జేస్తే జీవవైవిధ్యానికే ప్రమాదం ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.



చట్టానికి సంస్కృతంలో పేరు

ప్రస్తుత ఫారెస్ట్ (కన్జర్వేషన్) యాక్ట్ పేరు మార్చేందుకు కూడా తాజా సవరణ బిల్లులో ప్రతిపాదించారు. ఇక నుంచి ఈ చట్టాన్ని వన (సంరక్షణ్ ఏవం సంవర్ధన్) అధినియమ్ అని సంస్కృతంలోకి పేరు మార్చేలా సవరణలను మోడీ సర్కార్ ప్రతిపాదించింది. దీనిపై ప్రతిపక్షాల సభ్యులందరూ ముక్తకంఠంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కృత పదజాలాన్ని బలవంతంగా రుద్దాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని డిఎంకె సభ్యులు గిరిరాజన్ హెచ్చరించారు. ఇలాంటి పదజాలం వినియోగించడం హిందీయేతర రాష్ట్రాల్లోని ప్రజలను విస్మరించడమేనని బర్దోలి విమర్శించారు. అటవీ సంపదపై రాష్ట్రాలకు ఉన్న హక్కులను కూడా కాలరాసేందుకు మోడీ సర్కార్ ఈ సవరణ బిల్లు ద్వారా కుట్ర పన్నుతోందని డిఎంకె సభ్యులు విమర్శించారు. అటవీ, అటవీ సంరక్షణ అనేవి ఉమ్మడి జాబితాలోని అంశాలని, వీటి నిర్వహణ, నియంత్రణ అధికారాలు రాష్ట్రాలకే ఉన్నాయన్న సంగతి మోడీ సర్కార్ విస్మరిస్తోందన్నారు.

ఆర్టికల్ 370 రద్దుపై ఆగస్టు 2 నుంచి విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జమ్మూ కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించిన రాజ్యాంగంలోని అధికరణ 370ని రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై రోజువారీ విచారణ జరుపుతామని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం తెలిపింది. ఆగస్టు రెండు నుంచి సోమవారం, శుక్రవారం మినహా మిగిలిన పని దినాల్లో వీటిపై విచారణ జరుగుతుందని పేర్కొంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం వీటిని విచారించనుంది. ఈ కేసులో దస్త్రాలు, రాతపూర్వక వివరణల సమర్పణకు జులై 27ను తుది గడువుగా నిర్ణయించింది. ఈ అధికరణ రద్దును సవాలు చేసిన పిటిషనర్ల జాబితా నుంచి తమ పేర్లను తొలగించాలని కోరుతూ మాజీ ఐఎఎస్ అధికారి షా ఫైజల్, జెఎన్‌యు మాజీ విద్యార్థి నేత షెహలా రషీద్ చేసిన అభ్యర్థనకు సర్వోన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది.

బంజారాలకు ఎస్‌టి హోదాపై

ఎస్‌సి, ఎస్‌టి ఉత్తర్వులు (సవరణ) చట్టం - 1976 ప్రకారం తెలంగాణలో బంజారా, లంబాడా, సుగాలీలను ఎస్టీలుగా గుర్తించడం రాజ్యాంగ విరుద్ధమంటూ దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు 4 వారాల పాటు వాయిదా వేసింది. గోండ్వానా వెల్ఫేర్ సొసైటీ దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను జస్టిస్ జెకె మహేశ్వరి, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం విచారించింది.

ఎన్నిసార్లు పొడిగిస్తారు?

(మొదటి పేజీ తరువాయి)

గవాయ్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కరోల్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం వెలువరించింది. మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించడం సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ 2021లో ఇచ్చిన తీర్పునకు విరుద్ధమని పేర్కొంది. 2021 నవంబరు తరువాత ఆయన పదవీ కాలాన్ని పొడిగించరాదని నాటి తీర్పులో సుప్రీంకోర్టు మాండమస్ జారీ చేసిందని ధర్మాసనం గుర్తు చేసింది. ఇడి డైరెక్టర్ పదవీ కాలాన్ని పొడిగించేందుకు చట్టాన్ని చేసే అధికారం చట్ట సభలకు ఉందని, అయితే మిశ్రా పదవీ కాలాన్ని పొడిగించరాదని 2021నాటి తీర్పు స్పష్టంగా చెప్తోందని ధర్మాసనం తెలిపింది.

ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ చట్టాల్లో సవరణలను సుప్రీంకోర్టు సమర్థించింది. సిబిఐ చీఫ్, ఇడి డైరెక్టర్ పదవీ కాలం రెండేళ్లు పూర్తయిన తరువాత మరో మూడేళ్ల వరకు పొడిగించేందుకు ఈ సవరణల వల్ల కేంద్ర ప్రభుత్వానికి అధికారం లభించింది. మిశ్రా మొదట 2018 నవంబరులో ఇడి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. రెండేళ్ల పదవీ కాలం పూర్తయిన తరువాత 2020 నవంబరులో ఆయన పదవీ కాలాన్ని పొడిగించారు. 2020 మే నెలలో ఆయన వయసు 60 సంవత్సరాలు నిండింది. 2020 నవంబర్ 13న 'రెండేళ్ల' కాలాన్ని 'మూడేళ్ల' కాలానికి మార్చే విధంగా రాష్ట్రపతి 2018 ఉత్తర్వును సవరించినట్లు పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిని కామన్ కాజ్ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఈ సవరణను సుప్రీంకోర్టు 2021 సెప్టెంబరులో ఆమోదించింది. మిశ్రాకు మరిన్ని పొడిగింపులు ఇవ్వవద్దని రూలింగ్ ఇచ్చింది. ఈ కేసులో అమికస్ క్యూరీ అయిన సీనియర్ న్యాయవాది కెవి విశ్వనాథన్ (ఇప్పుడు సుప్రీం కోర్టు న్యాయమూర్తి) ఫిబ్రవరిలో మిశ్రా పదవీకాలం పొడిగింపు చట్టవిరుద్ధమని సమర్పించారు. ఈ నేపథ్యంలో మిశ్రా పదవీకాలాన్ని పొడిగించడాన్ని తప్పుబడుతూ ఆయన ఈ నెల 31న పదవి నుంచి వైదొలగాలని సుప్రీంకోర్టు నిర్దేశించింది.

ప్రతిపక్షాల భేటీకి మరో 8 పార్టీలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపిని ఓడించాలనే లక్ష్యంతో ఇప్పటికే సమాలోచనలు చేస్తున్న ప్రతిపక్షాలతో మరికొన్ని పార్టీలు జట్టుకట్టాయి. బెంగళూరులో జరిగే ప్రతిపక్షాల సమావేశానికి హాజరు అవుతామని కొత్తగా 8 పార్టీలు ముందుకు వచ్చాయి. బిజెపి వ్యతిరేక శిబిరానికి కొత్తగా మద్దతు ప్రకటించిన పార్టీలలో మరుమలర్చి ద్రవిడ మున్నేట్ర కళగం (ఎండిఎంకె), కొంగు దేశ మక్కల్ కట్చి (కెడిఎంకె), విడుదలై చిరుతైగళ్ కట్చి (విసికె), రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌ఎస్‌పి), ఆల్ ఇండియా ఫార్వాడ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) ఉన్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ అధ్యక్షతన పాట్నాలో గత జూన్ 23న జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో 16 పార్టీలు పాల్గొన్నాయి. ఇప్పుడు కాంగ్రెస్ నేతృత్వంలో ఈ నెల 17,18 తేదీల్లో బెంగళూర్‌లో తలపెట్టిన ప్రతిపక్షాల సమావేశానికి 23 పార్టీలు హాజరుకానున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా ప్రతిపక్ష పార్టీ నేతలకు కాంగ్రెస్ అధ్యక్షులు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతలందరికీ మంగళవారం లేఖలు పంపారు. పాట్నాలో జరిగిన సమావేశ వివరాలను కూడా ఆయన లేఖలో ప్రస్తావించారు. 'ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిణమిస్తున్న పలు అంశాలతో పాటు అనేక కీలక అంశాలను పాట్నా సమావేశంలో చర్చించాం. రాబోయే సార్వత్రిక ఎన్నికలను సమైక్యంగా ఎదుర్కోవాలని ఏకగ్రీవంగా తీర్మానించాం. ఆ దిశగా పాట్నా సమావేశం విజయవంతమైంది' అని లేఖలో ఖర్గే పేర్కొన్నారు. దేశం ఎదుర్కొంటున్న సవాళ్లకు ఒక పరిష్కారానికి కనుగొనేందుకు సమష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఖర్గే అన్నారు.



మీకోసం

ముదిరిపోయిన ఆనప గింజలను బియ్యంతో కలిపి నానేసి, రుబ్బుకొని దోసెలు పోసుకుంటే చాలా రుచిగా ఉంటాయి.

జీవన సౌరభం

ఆపద వచ్చినప్పుడు ధైర్యంగా ఉంటే, దాన్నుంచి సగం బయటపడ్డట్టే!

JEEVANA జీవన the family

ప్రకృతి వింతలు

బాలల్లారా! రారండి!
సూర్యచంద్రుల కథ వినరండి
సూర్యుడు పెద్ద నక్షత్రం
చంద్రుడు భూమికి ఉపగ్రహం


ఆకాశంలో సూర్య చంద్రులు
మానవాళికి మంచి మిత్రులు
విశ్రమించక పరిశ్రమించే
ప్రకృతి వింతలు ఆ రెండు

పగటి వేళలో వెలుగును ఇస్తూ
పంట పొలాలకు ఆహారాన్నిస్తూ
ఎండ వేడిమిని భూమికి ఇస్తూ
సూక్ష్మ క్రిములను చంపును సూర్యుడు

హాయిని గొలిపే వెన్నెలనిస్తూ
చల్లని చూపులు భూమిపై నిలిపి
ఎల్ల ప్రాణులకు సుఖాన్నిస్తూ
రాత్రివేళలో ఆదుకొనును చంద్రుడు
వారు లేనిదే భూమే లేదు.. జగతే లేదు
అందుకే కొలిచెను జనులంతా



- డాక్టర్ దార్ల బుజ్జిబాబు



6
2
4
3
7
5

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని బొమ్మలు, వాటికి ఎదురుగా అంకెలు ఇచ్చాం. బొమ్మల సంఖ్యకు సరైన అంకెను జత చేయండి.

నేను గీసిన బొమ్మ



బి.వైనవి,
8వ తరగతి,
కేంద్రీయ విద్యాలయం-1,
విశాఖపట్టణం



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

వర్షాకాలం .. పాముల భయం ...



వేసవి తాపం నుంచి ఉపశమనం ఇచ్చేది వర్షాకాలం. రైతులకు అతి ముఖ్యమైన కాలమిదే. వర్షాలు సమద్ధిగా కురిస్తేనే పాడిపంటలతో దేశం సస్యశ్యామలమవుతుంది. వర్షాకాలంలో రకరకాల ప్రమాదాలు కూడా పొంచి ఉన్నాయి. సాధారణంగా వర్షాకాలం అంటే పాములు సంచరించే కాలం. వర్షాకాలంలో వర్షాలకు ప్రకతి మొత్తం పచ్చగా తయారవుతుంది. ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన గడ్డి దుబ్బులు, బహిరంగ ప్రదేశాల్లో గుబురుగా పెరిగిన మొక్కలు వెరసి అది పాములకు అడ్డాగా మారుతుంది. ఏటేటా జూన్ నుంచి సెప్టెంబర్ నెల వరకు వర్షాకాలం కావడంతో విషకీటకాలు కూడా విజంభిస్తాయి. పంట పొలాలకు నీరుపెట్టేందుకు వ్యవసాయ పనులకు పగలూ రాత్రీ తేడా లేకుండా ఎప్పుడంటే అప్పుడు రైతులు వెళ్లి వస్తుంటారు. ఈ సమయంలో అప్రమత్తంగా లేకపోతే పాముల రూపంలో మత్యువు కాచుకుని ఉండొచ్చు.

అన్నదాతలూ...జర భద్రం

పల్లెటూర్లలోని పంట పొలాల్లో, అటవీ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో, దట్టంగా అల్లుకున్న పొదల దగ్గర పాములు తరచూ సంచరిస్తూ ఉంటాయి. వర్షాకాలం మొదలైన తర్వాత రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పాముకాటు బాధితులు రోజురోజుకూ వందల్లో పెరిగిపోతుంటారు. వర్షాకాలంలో బురద ఎక్కువగా ఉండటం.. చెట్లు పొదలుగా పెరగడం వల్ల ఒక్క పాములే కాదు.. మండ్రకప్ప, తేలు కూడా ఎక్కువగా కనిపిస్తాయి. వాటి కాటుకు కూడా గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూఉంటారు. ఏటేటా జూన్ నుంచి సెప్టెంబర్ వరకూ పాములు, ఇతర విష కీటకాల బెడద ఎక్కువగా ఉంటుంది.



అన్ని పాములూ విష పూరితం కాదు

మనకు కనిపించే అన్ని పాములూ విషపూరితం కాదని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తపింజర, త్రాచు, కట్లపాము వంటి విషపాముల వల్లే ప్రమాదం ఉంటుందని, 50 శాతానికిపైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని వైద్యులు చెబుతున్నారు. అయితే ఏ పాము అయినా.. కాటేసిన వెంటనే వైద్యుని సంప్రదిస్తేనే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చు.

నాగుపాము ప్రమాదకరం

నాగుపాము అత్యంత ప్రమాదకరమైంది. ఇది కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని వైద్యనిపుణులు అంటున్నారు. ముందుగా కాటు వేసిన చోట నుంచి విషం పైకి వెళ్లకుండా వెంటనే కట్టు కట్టాలి. ఆ తర్వాత దగ్గరలోని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ముఖ్యంగా మనుషుల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. రక్తపింజరి సాధారణంగా జనావాసాల్లో అంతగా కనిపించదు. అటవీప్రాంతంలోనే ఎక్కువగా తిరుగుతుంది. అయితే ఈ పాము కాటు వేస్తే 2 గంటల తర్వాత విషం శరీరానికి ఎక్కుతుందని చెబుతున్నారు. రక్తపింజర కాటువేసిన వెంటనే తప్పనిసరిగా అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. కట్లపాము కాటేస్తే ప్రాణాపాయం చాలా ఎక్కువ. విషం రక్తంలోకి చేరకముందే చికిత్స అందిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

ఏటేటా వర్షాకాలంలో కృష్ణా, గోదావరి నదులకు వరద ముంపు రావటంతో పరివాహక, తీర గ్రామాలకు నీరు తాకుతూ ఉంటుంది. అలా కుదేలైన ఆయా గ్రామాల ప్రజలను పాములు బెంబేలెత్తిస్తుంటాయి.

వ్యవసాయ సీజన్‌లోనే ఎక్కువ

ఏటేటా వ్యవసాయ సీజన్‌లో విషసర్పాల కాట్లు కేసులు నిలువెల్లా వణికిస్తుంటాయి. గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరద ముంపు ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల నీటి ప్రవాహాల కారణంగా పెద్ద ఎత్తున పాములు కొట్టుకు రావడమే కాదు పుట్టలు, బొరియలు, భూమి నెర్రెల నుంచి బయటకు వచ్చి ఊళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఆ క్రమంలో అవి ప్రాణ భయంతోటి కనబడినవారినల్లా కాటేస్తున్నాయి. పాము కాటుకు గురైన వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించి, వెంటనే మెరుగైన చికిత్సకు సమీపంలోని ఆసుపత్రికి తీసుకెళ్తే ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశాలు ఉంటాయి.





ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ...

వర్షాకాలంలో తేమ, నీటి కాలుష్యం వల్ల బ్యాక్టీరియా, కీటకాలు తయారవుతాయి. దీంతో అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. దగ్గు, జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు కూడా తలెత్తుతాయి. తేమ బ్యాక్టీరియా విరేచనాలు, అజీర్ణం, కడుపులో ఇన్ఫెక్షన్ల వంటి వివిధ వ్యాధులకు దారితీస్తుంది. వీటి బారిన పడకుండా ఇంట్లోనే చిన్న చిట్కాలతో బయటపడవచ్చు. అవేంటో చూద్దాం.

తులసి : తులసిలో యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉంటాయి. ఇది ఇన్ఫెక్షన్ల నుండి కాపాడుతుంది. తులసి ఆకులను తినడం కానీ.. తులసి టీని తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాకుండా శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. ఇంకా ఒత్తిడి స్థాయిలను తగ్గిస్తుంది.

అల్లం : అల్లం ఉండే యాంటీ ఇన్‌ఫ్లేమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనాన్ని అందిస్తాయి. అల్లం టీ తీసుకోవడం లేదా ఆహారంలో అల్లం భాగం చేసుకోవడం వల్ల జీర్ణశక్తి పెరుగుతుంది.

వెల్లుల్లి : వెల్లుల్లిలో యాంటీమైక్రోబయల్, రోగనిరోధక శక్తిని పెంచే అల్లిసిన్లో సమృద్ధిగా ఉంటుంది. పచ్చి వెల్లుల్లిని తీసుకోవడం వంటలో భాగం చేసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్‌లను నివారించవచ్చు. వెల్లుల్లితో కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించవచ్చు. దీంతో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

అశ్వగంధ : అశ్వగంధ ఒత్తిడిని తగ్గించడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. అశ్వగంధ పౌడర్ లేదా క్యాప్సూల్స్ తీసుకోవడం వల్ల వాతావరణంలో మార్పును తట్టుకునే, రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేసే శక్తి శరీరానికి అందుతుంది.

వేప : వేపలో యాంటీమైక్రోబయల్, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. వేప ఆకులు లేదా వేప ఆధారిత ఉత్పత్తులను తీసుకోవడం వల్ల రక్తాన్ని శుద్ధి చేస్తుంది. అలాగే మలేరియా, డెంగ్యూ, ఫ్లూ వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉండవచ్చు.

రిగ్గింగ్, అక్రమాల మధ్య టిఎంసి గెలుపు

- ఫలితాలు/ ఆధిక్యతలు వెలువడిన 57,665 గ్రామ పంచాయతీ స్థానాల్లో తృణమూల్ 36,665
- బిజెపి7,263, సిపిఎం-2,397, కాంగ్రెస్- 1811 • మెరుగుపడిన లెఫ్ట్

కొల్‌కతా : బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో అడ్డుఅదుపులేని హింస, భారీగా ఎన్నికల అక్రమాలకు పాల్పడిన అధికార తృణమూల్ కాంగ్రెస్ చివరికి ఫలితాల్లో తనదే పైచేయి అని చాటుకుంది. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య 23 జిల్లాల్లోని 339 కౌంటింగ్ కేంద్రాల్లో మంగళవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమైంది. మొదట గ్రామ పంచాయితీ, తరువాత పంచాయతీ సమితి, చివరిగా జిల్లా పరిషత్ ఓట్ల లెక్కింపు చేపట్టారు. కడపటి వార్తలందే సరికి 63, 229 గ్రామ పంచాయతీలకు గాను 57,136 స్థానాల్లో ఫలితాలు, ఆధిక్యతలు వెలువడగా తృణమూల్ -36, 665, బిజెపి 7,263, లెఫ్ట్ 2,397, కాంగ్రెస్-1811 స్థానాల్లో ముందంజలో ఉన్నాయి. 9,730 పంచాయతి సమితి స్థానాలకు గాను 2,505 స్థానాల ఫలితాలు, ఆధిక్యతలు వెల్లడించగా తృణమూల్ 2,319, బిజెపి-109, లెఫ్ట్ 39, కాంగ్రెస్ 36 స్థానాల్లో ఆధిక్యతలో ఉన్నాయి. మొత్తమ్మీద లెఫ్ట్ మరీ ముఖ్యంగా సిపిఐ(ఎం) గతంతో పోలిస్తే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించింది. రాష్ట్రంలో గ్రామపంచాయతీ మొత్తం సీట్లు 63,229. ఇందులో 6,238 సీట్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పంచాయతీ సమితిలో మొత్తం సీట్లు 9,730. ఇందులో 759 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. జిల్లా పరిషత్‌లో మొత్తంగా 928 స్థానాలు ఉండగా, ఏకగ్రీవంగా 8 స్థానాలు ఎన్నికయ్యాయి. మొత్తంగా పశ్చిమ బెంగాల్‌లో 73,887 గ్రామ స్థానిక సంస్థల స్థానాలు ఉండగా, ఇందులో 7005 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఈ ఏడాది పోటీలేకుండా ఎన్నికైన సీట్ల శాతం 9.48 శాతంగా ఉంది. మిగిలిన స్థానాలకు ఈ నెల 8న ఎన్నికలు జరిగాయి.

కౌంటింగ్ రోజునా రెచ్చిపోయిన టిఎంసి గూండాలు

బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల ప్రారంభం నుంచి విధ్వంసానికి పాల్పడుతున్న టిఎంసి గూండాలు చివరి అంకం కౌంటింగ్ రోజున కూడా రెచ్చిపోయారు. అనేక కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రతిపక్ష పార్టీల ఏజెంట్లపై దాడులకు దిగారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడి నిర్బంధం

పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో డైమండ్ హర్బర్ వద్ద ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రాతికూర్ రహ్మాన్‌ను మంగళవారం పోలీసులు నిర్బంధంలోకి తీసుకున్నారు. రహ్మాన్ అక్రమ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. సెంట్రల్ కొల్‌కతాలోని కాలేజ్ స్ట్రీట్‌ను దిగ్బంధించారు.

బెంగాల్ ప్రజలకు సిపిఎం అభినందనలు

తృణమూల్ హింసను తిప్పికొట్టారని పొలిట్‌బ్యూరో ప్రశంస

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్ పంచాయితీ ఎన్నికల సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ కనివినీ ఎరుగని రీతిలో సాగించిన హింసను తిప్పికొట్టడంలో అసమానమైన ధైర్య సాహసాలను ప్రదర్శించిన పశ్చిమ బెంగాల్ ప్రజలు , వామపక్ష సంఘటన, ఇతర ప్రజాతంత్ర శక్తులను సిపిఐ(ఎం) అభినందించింది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. జులై 8న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మూడంచెల పంచాయతీ రాజ్ ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రభుత్వానికి తొత్తులా వ్యవహరించాయని పొలిట్‌బ్యూరో విమర్శించింది.ఎన్నికల హింసకు 60మంది బలయ్యారు. వందలాదిమంది గాయపడ్డారు.

స్వేచ్ఛగా, సక్రమంగా జరిగే ఎన్నికల్లో ప్రజలు తమకు ఇష్టమైన వారికి ఓటు వేసుకునే ప్రజాస్వామ్య హక్కును తిరస్కరించడమే లక్ష్యంగా హింస చెలరేగింది. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడంతో మొదలు బలవంతంగా వాటిని ఉపసంహరించుకునేలా ఒత్తిడి తీసుకురావడం, స్క్రూటినీ క్రమాన్ని తారుమారు చేయడం, ఓటింగ్ రోజున హింసకు పాల్పడడం ఇలా ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని దశల్లోను భయంకరమైన రీతిలో దాడులకు పాల్పడింది. చివరకు ఓట్ల లెక్కింపు రోజున కూడా ఈ హింసాకాండ తప్పలేదు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో భద్రతా సిబ్బందే తగినంత మంది లేరు, ఇక కోల్‌కతా హైకోర్టు ఆదేశించిన విధంగా కేంద్ర భద్రతా బలగాల మోహరింపు గురించి మాట్లాడే పనే లేదు. ఓట్ల లెక్కింపు కేంద్రాల నుండి ప్రతిపక్షాలకు చెందిన కౌంటింగ్ ఏజెంట్లను బయటకు పంపివేయడం, బ్యాలట్ బాక్సులు పగలగొట్టడం, ప్రతిపక్షాలకు ముఖ్యంగా వామపక్షాలు, వారి మిత్రపక్షాలకు ఓటు వేసిన బ్యాలట్ పత్రాలను విసిరివేయడం, గెలుపొందిన అభ్యర్ధులకు జారీ చేసే సర్టిఫికెట్లు బలవంతంగా లాక్కోవడం, ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎంఎల్‌ఎలు, ఇతర అనధికార వ్యక్తులతో పెద్ద సంఖ్యలో తృణమూల్ కాంగ్రెస్ గూండాలు వుండడం వంటి ఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి.

పాలక పార్టీ, ప్రభుత్వం ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకున్నాయి. ప్రధానంగా వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర మిత్రులపై దృష్టి కేంద్రీకరించాయి. బిజెపితో మాత్రం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ వచ్చాయి.. అంటే ఇక పాలక పార్టీ గూండాయిజాన్ని ప్రధానంగా ఎదుర్కొన్నది వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర బిజెపి వ్యతిరేక, తృణమూల్ వ్యతిరేక శక్తులే అన్నది ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

వామపక్షాలు, ఇతర లౌకిక మిత్రపక్షాలకు చెందిన అభ్యర్ధులను పెద్ద సంఖ్యలో గెలిపించినందుకు ప్రజలను పొలిట్ బ్యూరో ప్రత్యేకంగా అభినందించింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజాస్వా మ్యం, ఐక్యత, శాంతి కోసం జరిగే పోరాటంలో ప్రజా ప్రతిఘటన అనేది కొత్త అంశంగా వుందని పొలిట్‌బ్యూరో పేర్కొంది.



సెకండ్ సింగిల్ వచ్చేసింది!

చిరంజీవి హీరోగా మెహర్ రమేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోళా శంకర్' చిత్రం నుండి మంగళవారం సెకండ్ సింగిల్ విడుదలైంది. రెండు రోజుల క్రితం దీనికి సంబంధించిన ప్రోమో విడుదల చేశారు. తాజాగా పూర్తి లిరిక్స్‌తో ఉన్న పాటను విడుదల చేశారు. 'జామ్ జామ్ జజ్జనక' అనే పల్లవితో సాగిన ఈ పాటలో చిరంజీవి డ్యాన్స్ అభిమానులకు ఖుషీ చేస్తోంది. పార్టీ సాంగ్‌గా ఆకట్టుకునే ట్యూన్‌తో అలరించే లిరిక్స్‌తో ఈ పాట సాగింది. అనురాగ్ కులకర్ణి, మంగ్లీ ఆలపించిన ఈ సాంగ్‌ని కాసర్ల శ్యామ్ రచించారు. ఈ మూవీలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తుండగా కీర్తి సురేష్ చిరంజీవికి చెల్లెలి పాత్రలో నటిస్తోంది. మహతి స్వరసాగర్ సంగీతం అందిస్తున్న ఈ మూవీని ఏకే ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై అనిల్ సుంకర ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఆగష్టు 11న ఈ చిత్రం విడుదలకానుంది.

హిమాచల్ బాధితులకు హెల్ప్ లైన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భారీ వర్షాల కారణంగా హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌తో పాటు ఇతర ప్రభావిత రాష్ట్రాలలో చిక్కుకున్న రాష్ట్ర వాసులకు సహకారం అందించటానికి ఏపి ప్రభుత్వం హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు ఓఎస్‌డి పి రవి శంకర్ (ఫోన్ నెంబర్ 9871999055), జూనియర్ అసిస్టెంట్ కె. సునీల్ కుమార్ (ఫోన్ నెంబర్ 8800924911)ను సంప్రదించాలని సూచించింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కూడా హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. బాధితులు జి రక్షిత్ (ఫోన్ నెంబర్ 9643723157), వందన (9871999044)ను సంప్రదించాలని పేర్కొంది.

సిఆర్‌ఎంటిలుగా సిఆర్‌పిలు

- ప్రభుత్వం ఉత్తర్వులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మండలాల్లో ఉండే క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సిఆర్‌పి)లను ఇక ముందు క్లస్టర్ రిజర్వుడు మొబైల్ టీచర్లు (సిఆర్ఎంటి)గా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. వీటిని మంగళవారం బయటపెట్టారు. మండల పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సెలవులు పెట్టిన సమయంలో ఎంఇఒలు దానిపై త్వరగా నిర్ణయం తీసుకోకపోవడం ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించక పోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒకవేళ తెలిపినా ఆలస్యంగా రావడం వల్ల సరైన విద్యా ప్రమాణాలు అందించలేకపోతున్నారని తెలిపారు. అయితే పాఠశాలల్లో పిల్లలు తగ్గడం, బదిలీల వల్ల చాలా చోట్ల సిఆర్‌పిలు ఖాళీగా ఉంటున్నారని, అటువంటి వారిని ఇక నుండి ఖాళీ స్థానాల్లో వాడుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు సిఆర్‌పిలను సిఆర్‌ఎంటిలుగా మారుస్తున్నట్లు ప్రకటించారు. మండలాల పరిధిలో ఎవరైనా టీచర్లు సెలవు పెడితే అక్కడ సిఆర్‌ఎంటిలను పంపించనున్నారు. నూతన ఉత్తర్వుల ప్రకారం ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సిఆర్‌పిలు హైస్కూలు హెడ్మాస్టర్ పరిధి లో నాలుగు లేదా ఐదు ఎలిమెంటరీ, యుపి స్కూళ్లకు కలిపి నలుగురై దుగురు ఉండేవారు. ఇక ముందు వారంతా ఎంఇఒ అజమాయిషీ లోకి వెళ్లనున్నట్లు ఉత్తర్వులో పొందుపరిచారు. ఈ ఉత్తర్వులపై యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ఖాళీలు చాలా వరకూ ఉన్నాయని, వాటిని బదిలీ చేస్తే సిఆర్‌పిలను వినియోగించుకోవాల్సిన అవసరం ఉండదని అన్నారు. టీచర్ల స్థాయిలో వారు విద్యా ప్రమాణాలు బోధించలేరని, కేవలం ఖాళీ లేకుండా చూడటం తప్ప విద్యా బోధన సరిగ్గా ఉండదని తెలిపారు. ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ వేసి ఖాళీలను పూర్తి చేయడం ద్వారానే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు.

ఓటర్ల జాబితాపై సిఇసికి ఇసి వివరణ

డిప్యూటీ కమిషనర్‌తో ఎంకె మీనా భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ఎన్నికల సంఘం (సిఇసి) పిలుపు మేరకు ఢిల్లీ వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేశ్ కుమార్ మీనా ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అవకతవకలు, అసంబద్ధ మార్పులు, చేర్పులు చోటుచేసుకున్న మీడియాలో పెద్ద ఎత్తున కథనాలు రావడంతో పాటు, నేరుగా సిఇసికి కూడా ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మీనాను ఢిల్లీ రావాల్సిందిగా సిఇసి ఆదేశించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీ చేరుకున్న మీనా.. కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌తో సమావేశమయ్యారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమ్మరీ రివిజన్‌పై వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అనంతరం సిఇసి ఆయనకు కొన్ని కర్తవ్యాలను నిర్దేశించినట్లు సమాచారం. అందులో భాగంగా ఈ నెల 20న ఏపిలో రాజకీయ పార్టీలతో ముఖేష్ కుమార్ మీనా సమావేశం కానున్నారు. పోలింగ్ కేంద్రం స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటికి వెళ్లి ఓటర్లను తనిఖీ చేయనున్నారు. కొత్త ఓటర్లను చేర్చుకోవడం, చనిపోయిన వారిని తొలగించడం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలోనూ ఇసి పరిశీలన చేయనున్నారు. ఇంటింటికి వెళ్లే ఇసి బృందంలో వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లను (బిఎల్‌ఎ)ను కూడా నియమించుకునే వీలుంది. ఆ తర్వాత ఆగస్టు 2, 3 తేదీల్లో విశాఖలో ఎన్నికల సంఘం సమావేశం కానుంది.

రెండో టి20లోనూ గెలుపే..!

ఉత్కంఠ పోరులో బంగ్లాదేశ్ మహిళలపై 8పరుగుల తేడాతో గెలుపు • సిరీస్ 2-0తో కైవసం

ఢాకా: భారత మహిళల క్రికెట్ జట్టు వరుసగా రెండో టి20లోనూ గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంది. మంగళవారం జరిగిన రెండో టి20లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన 8పరుగుల తేడాతో బంగ్లాదేశ్ మహిళలపై విజయం సాధించింది. స్వల్ప స్కోర్లు నమోదైన ఈ మ్యాచ్‌లో భారతజట్టు బంగ్లాదేశ్‌ను ఓడించి మూడు టి20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో కైవసం చేసుకుంది. ఆఖరి ఓవర్ వరకూ విజయం దోబూచులాడిన పోరులో షఫాలీ వర్మ సంచలన బౌలింగ్‌తో జట్టును గెలిపించింది. దీప్తి శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 95 పరుగులు మాత్రమే చేసింది. ఓపెనర్ షఫాలీ వర్మ(19) టాప్ స్కోరర్. కెప్టెన్ హర్మన్‌ప్రీత్(0), జెమీమా రోడ్రిగ్స్(8), మంధాన (13), హర్లీన్ డియోల్(6) విఫలమయ్యారు. బంగ్లా బౌలర్లు సుల్తానా ఖాతూన్‌కు మూడు, ఫాతిమాకు రెండు వికెట్లు దక్కాయి. స్వల్ప లక్ష్యఛేదనలో బంగ్లాదేశ్ తడబడింది. భారత స్పిన్నర్ల దెబ్బకు 87 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ నిగార్ సుల్తానా(38) మాత్రమే రెండంకెల స్కోరు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దీప్తి శర్మతోపాటు షఫాలీ వర్మకు చెరో మూడు వికెట్లు పడగొట్టారు.

వోంద్రుసోవా చేతిలో పెగుల స్విటోలినా చేతిలో స్వైటెక్ ఓటమి

వింబుల్డన్ సెమీస్‌కు అన్‌సీడెడ్ క్రీడాకారిణులు

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఒకేరోజు రెండు సంచలనాలు నమోదయ్యాయి. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో టాప్‌సీడ్, ఇగా స్వైటెక్(పోలండ్), 4వ సీడ్ పెగుల(అమెరికా) అన్‌సీడెడ్ క్రీడాకారిణుల చేతుల్లో పరాజయాన్ని చవిచూశారు. స్వైటెక్ ఉక్రెయిన్‌కు చెందిన ఎలీనా స్విటోలినా చేతిలో, పెగుల చెక్ రిపబ్లిక్‌కు చెందిన మార్కెటా వోంద్రుసోవా చేతిలో పోరాడి ఓడారు. అన్‌సీడెడ్ వోంద్రుసోవా, స్విటోలినా ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ సెమీస్‌కు చేరడం ఇదే తొలిసారి. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 42వ స్థానంలో ఉన్న వోంద్రుసోవా 6-4, 2-6, 6-4తో జెస్సికా పెగూలపై, 76వ ర్యాంక్ క్రీడాకారిణి స్విటోలీనా 7-5, 6-7(5-7), 6-2తో టాప్ సీడ్, ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ విజేత ఇగా స్వైటెక్‌పై విజయం సాధించారు. వోంద్రుసోవా.. తొలి సెట్‌ను సునాయాసంగా నెగ్గి రెండో సెట్‌ను చేజార్చుకుంది. మూడోసెట్‌లోనూ ఓ దశలో 1-4తో వెనుకబడ్డ వోంద్రుసోవా.. ఆ తర్వాత ప్రత్యర్థికి ఒక్క పాయింట్ కూడా ఇవ్వకుండా ఆ సెట్‌ను 6-4తో చేజిక్కించుకొని విజయం సాధించడం విశేషం. రెండో క్వార్టర్‌ఫైనల్లో ఇగా స్వైటెక్ పోరాడినా ప్రయోజనం లేకపోయింది. తొలి సెట్‌ను 5-7తో చేజార్చుకున్న స్వైటెక్ రెండో సెట్‌నూ టై బ్రేక్ వరకు పోరాడింది. టై బ్రేక్‌లో ఓ దశలో 1-4పాయింట్లతో వెనుకబడ్డా అద్భుతంగా పుంజుకొని 7-5పాయింట్లతో ఆ సెట్‌ను కైవసం చేసుకుంది. నిర్ణయాత్మక మూడోసెట్‌లో స్వైటెక్ పుంజుకోలేకపోయింది.

రోహిత్ కెప్టెన్సీకి పరీక్ష

వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ నేటినుంచే.. రాత్రి 7.30గం॥ల నుంచి

డొమినిక: భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా, శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ అజింక్య రహానేలతో పటిష్టంగా ఉంది. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్(డబ్ల్యుటిసి) ఫైనల్లో ఓడిన అనంతరం టీమిండియా 2023-25 ఛాంపియన్‌షిప్‌లో భాగంగా వెస్టిండీస్‌తో తొలి టెస్ట్ సిరీస్ ఆడనుంది. టీమిండియా బ్యాటర్లు ఫామ్‌లో ఉండగా.. అనుభవం లేని బౌలింగ్ విభాగంతో భారత జట్టు విండీస్‌లో తలపడనుంది. ఇక విండీస్ ఆటగాళ్లు మెకంజీ, అథంజే, టెవిన్ ఇమ్లాచ్, జోర్డాన్, భారత ఆటగాళ్లలో ఇషాన్, జైస్వాల్, ముఖేష్, గైక్వాడ్‌కు తొలిసారి టెస్టుల్లో అరంగేట్రం చేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68